Website: www.subhatelangana.in

RNI-TELTEL/2017/72695

ఆగురువారం
1 ఆగస్టు 2024

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్

సంపుటి : 8
సంచిక : 88
పేజీలు : 6
వెల : 3/-

# శుభ తెలంగాణ

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక


మేడ్చల్

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar

## కేరళకు ముందే చెప్పాం..

- వయనాడ్ విలయంపై అమిత్ షా కీలక వ్యాఖ్యలు
- ఈ విషాద ఘటన తరుణంలో మోదీ ప్రభుత్వం కేరళ సర్కార్‌తోపాటు రాష్ట్ర ప్రజలకు అండగా నిలుస్తుంది
- రాష్ట్రానికి కేంద్రం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తాం
- రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే భారీగా ప్రాణ నష్టం జరిగింది

2



## మహిళల, చిన్నారుల భద్రతకు రూ.13,412కోట్లు ఖర్చు

- వివిధ పథకాలు, కార్యక్రమాల కింద కేంద్ర ప్రభుత్వం రూ.13,412కోట్లు ఖర్చు చేస్తోంది
- అలాగే రాష్ట్రాల సైన్స్ ఫోరెన్సిక్ లాబరేటరీల పటిష్టత కోసం రూ.106.75కోట్లు
- సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీలు, ఫోరెన్సిక్ డేటా సెంటర్, 6 సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీల ఆధునికీకరణకు మరో రూ.354.25కోట్లు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

2






## కూటమి సర్కార్‌లో భగ్గుమన్న విభేదాలు

- బీజేపీ తీరుపై జేడీఎస్ నేత, కేంద్ర మంత్రి కినుక
- పాదయాత్రపై ఎన్డీయే సంకీర్ణ సర్కార్ భాగస్వామి, జేడీఎస్ అసంతృప్తి
- తమను బీజేపీ పరిగణనలోకి తీసుకోకుండా నిర్ణయం తీసుకుంటే తామెందుకు వారికి మద్దతు ఇవ్వాలని
- పాదయాత్ర విషయంలో వారు తమ పట్ల ఎలా వ్యవహరించారు
- వారేం సాధించడానికి ప్రయత్నిస్తున్నారు

2

## కొందరు ఎమ్మెల్యేల సభ్యత్వాలు రద్దు!

- కోమటిరెడ్డి, సంపత్ కుమార్ సభ్యత్వం రద్దు కాలేదా?
- నన్ను కూడా ఏ ఒక్కరోజూ అసెంబ్లీలో ఉండనివ్వలేదు
- బీఆర్ఎస్ నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి పరోక్ష హెచ్చరిక
- సబితక్క ఈ తమ్ముణ్ని అనాథ చెయ్యొచ్చా అని వ్యాఖ్య
- కేటీఆర్ 100% ఆర్టిఫిషియల్.. 0 ఇంటెలిజెన్స్: సీఎం
- బీఆర్ఎస్ నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి పరోక్ష హెచ్చరిక



హైదరాబాద్, శుభ తెలంగాణ

సమయం, సందర్భాన్ని బట్టి కొందరు ఎమ్మెల్యేల సభ్యత్వాలూ రద్దు కావచ్చునని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ తొలి శాసన సభలో గవర్నర్ ప్రసంగం సందర్భంగా కుర్చీలో నుంచి లేచి నిలుచున్నారన్న కారణంతో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్ సభ్యత్వాలను రద్దు చేశారని, అప్పుడు వారు స్పీకర్ పోడియం వద్దకు కూడా వెళ్లలేదని.. 2014 నుంచి 2018 వరకూ ఏ ఒక్క సమావేశంలోనూ తనను ఉండనీయ లేదని, సభకు వచ్చిన వెంటనే తీసుకెళ్లి బయటకు తోసేశారని గుర్తు చేశారు. ఇప్పుడూ సభ్యుల శాసనసభ సభ్యత్వాలను స్పీకర్ రద్దు చేసినా చెయ్యవచ్చున్నారు. సభలో సస్పెన్షన్లు, బహిష్కరణలు, మార్షల్స్ అవసరం రావద్దనే తాను కోరుకుంటున్నానన్నారు. అసెంబ్లీలోని తన చాంబర్లో బుధవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన రేవంత్.. - మిగతా3లో



## ఎల్ఆర్ఎస్‌కు పచ్చజెండా..

- నేటి నుంచి కార్యాచరణ.. పెండింగ్ దరఖాస్తులకు మోక్షం
- మూణ్నెల్లలో క్షేత్రస్థాయి పరిశీలన.. అంతా ఆన్‌లైన్‌లోనే..
- నాలుగు దశల్లో వడపోత.. అనుమతికి సర్కారు ఉత్తర్వులు
- 4 ఏళ్ల నిరీక్షణకు తెర.. నేడు అధికారులతో సీఎస్ సమీక్ష

హైదరాబాద్ శుభ తెలంగాణ

లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకాన్ని(ఎల్ఆర్ఎస్) ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో నాలుగేళ్ల నిరీక్షణకు తెరపడనుంది. గురువారం నుంచి ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రారంభమవ్వనుంది. మూణ్నెల్లలో క్షేత్రస్థాయి పరిశీలనను పూర్తిచేసుకునేలా.. నాలుగు దశల్లో ఈ దరఖాస్తుల స్క్రూటినీ జరగాలని నిర్దేశిస్తూ ప్రభుత్వం - మిగతా3లో



## జనగణన పట్టదా?

- కేంద్రాన్ని నిలదీసిన సోనియాగాంధీ
- జనాభాలెక్కల సేకరణలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యంతో దేశంలో ఇతమిత్థమైన జనాభా ఎంతో తెలియకుండా పోతుంది
- 2021లో జనాభాలెక్కల సేకరణ జరగాల్సి ఉన్నప్పటికీ అలాంటి ఉద్దేశం ప్రభుత్వానికి లేదని చాలా స్పష్టంగా తెలుస్తోంది
- కేంద్ర బడ్జెట్ 2024-25లో రైతులు, యువత డిమాండ్లను పట్టించుకోలేదు
- పలు కీలక రంగాలకు కేటాయింపుల్లో న్యాయం జరగలేదు

2

## కేటీఆర్.. రెచ్చగొట్టకు

- సీఎం రేవంత్ ఆగ్రహం!
- కేటీఆర్ రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు
- మోసం అనే ప్రణాళికలు అమలు చేస్తున్నారు
- పదేళ్లు ఏలిన మీరు పది నెలలు నిండని ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారు
- బతుకమ్మ పథకాన్ని ప్రారంభించిన ఏడాది సిరిసిల్లలో నేతన్నలు ఆ చీరలు నేశారా?



హైదరాబాద్, శుభ తెలంగాణ

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఏడో రోజూ హాట్ హాట్‌గానే సాగుతున్నాయి. ద్రవ్య వినిమయ బిల్లును డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టగా.. అది కాస్త ఎక్కడెక్కడికో పోయింది. కాసేపు మంత్రులు వర్సెస్ కేటీఆర్‌గా పరిస్థితులు నడవగా.. మరి కొద్దిసేపు సీఎం రేవంత్ రెడ్డి-కేటీఆర్‌ల మధ్య పెద్ద మాటల యుద్ధమే నడిచింది. ఈ క్రమంలో ఒకింత ఆగ్రహానికి లోనైన ముఖ్యమంత్రి.. కేటీఆర్ రెచ్చగొట్టే ప్రయత్నం చేయకండి అని హెచ్చరించారు! 'ఫార్మా సిటీ భూములు వెనక్కి ఇస్తామని హామీ ఇచ్చారు.. చేయండి. మూసీని లండన్ చేస్తాం అంటున్నారు.. చేయండి. మూసీ సుందరీకరణను స్వాగతిస్తున్నాము. - మిగతా5లో



## తెలంగాణ గవర్నర్‌గా ప్రమాణ చేసిన జిష్ణుదేవ్ వర్మ

- ప్రమాణస్వీకార కార్యక్రమానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పాటు పలువురు మంత్రులు

హైదరాబాద్, శుభ తెలంగాణ

తెలంగాణ గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ బుధవారం ప్రమాణం చేశారు. రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. ప్రమాణస్వీకారం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే, పుష్పగచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణస్వీకార కార్యక్రమానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మండలి చైర్మన్ - మిగతా3లో

## సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదు




- సింగరేణిని ప్రైవేటీకరణ అంశంపై క్లారిటీ ఇచ్చిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నకు పార్లమెంటు వేదికగా మరోసారి స్పష్టం చేసిన కేంద్రమంత్రి

న్యూఢిల్లీ, శుభ తెలంగాణ

సింగరేణిని ప్రైవేటీకరించే ఆలోచనేదీ కేంద్రప్రభుత్వానికి లేదని పార్లమెంటు వేదికగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ.కిషన్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. 24 జూలై నాడు పార్లమెంటు వేదికగా ఓ ప్రశ్నకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మౌఖికంగా సమాధానం ఇచ్చారు. సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని పునరుద్ఘాటించారు. రాష్ట్ర ప్రభుత్వం వాటా 51 శాతం, కేంద్రప్రభుత్వం వాటా 49 శాతం ఉండగా.. కేంద్రం సింగరేణిని ఎలా ప్రైవేటీకరిస్తుందని అన్నారు. ఇదే ప్రశ్నను.. బుధవారం (31 జూలై, 2024) నాడు హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అడగగా కేంద్రమంత్రి లిఖితపూర్వక - మిగతా3లో



## రేవంత్ అన్‌ఫిట్ సీఎం

- అకారణంగా, అసభ్యంగా, హీనంగా మహిళలను సభలో అవమానించారు
- మహిళా నేతలను ఏ ముఖం పెట్టుకొని వచ్చారంటారా? భట్టీ.. ఎంత ధైర్యం?
- తక్షణమే క్షమాపణ చెప్పాలి: కేటీఆర్
- ఆడబిడ్డలపై సీఎం వ్యాఖ్యలకు నిరసనగా నేడు దిష్టిబొమ్మ దహనాలకు పిలుపు

5

# పీకే ఆశలు ఫలించేనా

**పాట్నా :** పీకేఅలియాస్ ప్రశాంత్ కిషోర్.. దేశ రాజకీయాల్లో దశాబ్దాలుగా వినిపిస్తున్న మాట ఇది. ఎన్నికల వ్యూహకర్తగా తెరపైకి వచ్చిన ఆయన ఎన్నో విజయాలను సొంతం చేసుకున్నారు. జాతీయ పార్టీలతో పాటు ప్రాంతీయ పార్టీలకు విజయాలను అందించారు. ఎన్నికల వ్యూహ కర్తగా విశేష సేవలు అందించారు. ఇప్పుడు పూర్తిస్థాయి రాజకీయ నాయకుడిగా పరకాయ ప్రవేశం చేయనున్నారు. అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించనున్నారు. రెండేళ్ల కిందకి ఆయన జన్ సూరజ్ అనే సంస్థను ప్రారంభించారు. భవిష్యత్తులో దానిని రాజకీయ పార్టీగా మారుస్తానని ప్రకటించారు. ఈ నేపథ్యంలో వచ్చే అక్టోబర్ 2న పార్టీని ప్రారంభిస్తున్నానని.. పార్టీ నాయకత్వంతో పాటు విధి విధానాలను త్వరలో వెల్లడిస్తానని ప్రశాంత్ కిషోర్ స్పష్టం చేశారు. బీహార్ కు చెందిన ప్రశాంత్ కిషోర్ ఐక్యరాజ్యసమితిలో పనిచేశారు. ఐదేళ్లపాటు అక్కడే విధులు నిర్వహించారు. తరువాత ఎన్నికల వ్యూహకర్తగా మారారు. 2012లో తొలిసారిగా గుజరాత్ లో బిజెపి తరఫున వ్యూహకర్తగా పనిచేశారు. నరేంద్ర మోడీ మూడోసారి గుజరాత్ ముఖ్యమంత్రిగా చేయడంలో ప్రశాంత్ కిషోర్ కీలకపాత్ర పోషించారు. అదే అనుభవంతో 2014లో మోడీ నేతృత్వంలోని బిజెపి గెలుపునకు దేశవ్యాప్తంగా బిజెపి తరఫున పనిచేశారు. ప్రధాని పీఠంపై మోదీని కూర్చోబెట్టడంలో సక్సెస్ అయ్యారు. అప్పటినుంచి ప్రశాంత్ కిషోర్ పేరు మార్మోగింది.



ఆయన సేవల కోసం రాజకీయ పార్టీలు పడిగాపులు కాయాల్సి వచ్చింది. దేశవ్యాప్తంగా చాలా పార్టీలకు వ్యూహకర్తగా పనిచేసే విజయాలను అందించారు. అదే సమయంలో కొన్ని అపజయాలను సైతం మూటగట్టుకున్నారు. 2019 ఎన్నికలకు ముందు వైసీపీకి వ్యూహకర్తగా నియమితులయ్యారు ప్రశాంత్ కిషోర్. ఆ ఎన్నికల్లో జగన్ గెలుపునకు భారీగా వ్యూహాలు పన్నారు. అవి సక్సెస్ అయ్యాయి కూడా. ప్రజలను కుల, మతాలు, వర్గాలుగా విభజించి.. యూటర్న్ చేయడంలో ప్రశాంత్ కిషోర్ అంది వేసిన చేయి. ఆ ఎన్నికల్లో జగన్ గెలిచిన తర్వాత.. ప్రశాంత్ కిషోర్ తో విభేదాలు ఏర్పడ్డాయి. అందుకే ప్రశాంత్ కిషోర్ చంద్రబాబుతో చేతులు కలిపారు. ఈ ఎన్నికల్లో జగన్ కు దారుణ పరాజయం తప్పదని హెచ్చరించారు. ఊహించని ఓటమి ఎదురవుతుందని కూడా తేల్చి చెప్పారు. అదే మాదిరిగా జగన్ కు ఘోర పరాజయం ఎదురు కావడంతో ప్రశాంత్ కిషోర్ జోష్యం ఫలించింది ఒక్క జగన్ కే కాదు. ప్రశాంత్ కిషోర్ చాలా రాజకీయ పార్టీలకు సేవలు అందించారు. పశ్చిమ బెంగాల్లో తృణమూల్ కాంగ్రెస్ విజయానికి కూడా కృషి చేశారు. అయితే ఏ పార్టీతో అయితే పని చేస్తారో.. అదే పార్టీ అధినేతతో విభేదాలు పెంచుకుంటారు ప్రశాంత్ కిషోర్. ప్రధాని మోదీతో పనిచేసిన ఆయన.. అదే మోదీని వ్యతిరేకించారు. కాంగ్రెస్ కు దగ్గర అవుతూనే.. అదే పార్టీ విధానాలను ఎండగట్టారు. అందుకే ప్రశాంత్ కిషోర్ కు రాజకీయ శత్రువులు ఎక్కువ. గతంలో పీకే ను బందిపోటుతో పోల్చిన చంద్రబాబుకే రాజకీయ సలహాలు ఇచ్చారు.సీఎం నితీష్ కుమార్ నేతృత్వంలోని జేడీయు పార్టీలో చేరారు ప్రశాంత్ కిషోర్. కానీ ఆ పార్టీలో ఎక్కువ రోజులు ఉండలేకపోయారు. 2018లో జేడీయులో చేరిన పీకే.. 2020లో బహిష్కరణకు గురయ్యారు. పౌరసత్వ సవరణ చట్టం విషయంలో నితీష్ కు వ్యతిరేకంగా ప్రశాంత్ కిషోర్ వ్యాఖ్యానించడంతో.. పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. వెంటనే బీహార్లో కొత్త రాజకీయ పార్టీకి పావులు కదపడం ప్రారంభించారు. తొలుత జన సూరజ్ అనే సంస్థను స్థాపించారు. ఇప్పుడు అదే సంవత్సరం రాజకీయ పార్టీగా మార్చనున్నారు. ఆయన పార్టీతో ఎవరికి గండి పడుతుందో చూడాలి.

# జనగణన పట్టదా?

**న్యూఢిల్లీ:** దేశంలోని జనాభాను లెక్కించే ప్రక్రియ 2021లో జరగాల్సి ఉండగా, ఇంతవరకూ జనగణన ను కేంద్రం చేపట్టలేదని, అసలు ఆ ఉద్దేశమే ఉన్నట్టు కనిపించడం లేదని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ అన్నారు. జనాభాలెక్కల సేకరణలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యంతో దేశంలో ఇతమిత్థమైన జనాభా ఎంతో తెలియకుండా పోతుందన్నారు. దీనితో పాటు జాతీయ ఆహార భద్రతా చట్టం కింద 12 కోట్ల మంది, ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారు ఎలాంటి ప్రయోజనాలకు నోచుకోరని అన్నారు. న్యూఢిల్లీలో బుధవారంనాడు జరిగిన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో సోనియాగాంధీ మాట్లాడుతూ, 2021లో జనాభాలెక్కల సేకరణ జరగాల్సి ఉన్నప్పటికీ అలాంటి ఉద్దేశం ప్రభుత్వానికి లేదని చాలా స్పష్టంగా తెలుస్తోందన్నారు. తద్వారా దేశ జనాభా ఎంతనేది తెలియకుండా పోతుందని, దీనివల్ల జాతీయ ఆహార భద్రతా చట్టం-2013 కింద ఎస్సీ, ఎస్టీలతో సహా 12 కోట్ల మందికి ఎలాంటి లబ్ధి చేకూరదన్నారు.

**వయనాడ్ మృతులకు సంతాపం**

వయనాడ్ విలయంలో ప్రాణాలు కోల్పోయిన బాధితుల కుటుంబాలకు సోనియాగాంధీ సంతాపం తెలిపారు. ఇది హృదయ విదారక ఘటన అని, ఆ రాష్ట్రంలోని మన మిత్రులంతా బాధితులకు సాయం అందిస్తున్నారని చెప్పారు. దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ వరద బాధితులకు సానుభూతి తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలతో పాటు, నిర్వహణాలోపాలతో వరుస రైలు ప్రమాదాల్లో అనేక మంది మృత్యువాత పడుతున్నారని, బాధిత కుటుంబాల పరిస్థితి తమను కలిచివేస్తోందని అన్నారు.



**బడ్జెట్‌లో రైతులు, యువతను విస్మరించారు..**

కేంద్ర బడ్జెట్ 2024-25లో రైతులు, యువత డిమాండ్లను పట్టించుకోలేదని, పలు కీలక రంగాలకు కేటాయింపుల్లో న్యాయం జరగలేదని సోనియాగాంధీ అన్నారు. నిరుద్యోగిత, ద్రవ్యోల్బణంతో కోట్లాది మంది ప్రజానీకం అతలాకుతలమవుతున్నారని, వాటి విషయం బడ్జెట్‌లో పట్టించుకోలేదని విమర్శించారు. జాతీయ భద్రత, జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడులపై సోనియాగాంధీ మాట్లాడుతూ, ఉగ్రదాడుల్లో పెద్ద సంఖ్యలో భద్రతా సిబ్బంది, పౌరులు ప్రాణాలు కోల్పోతున్నారని, ఇందుకు భిన్నంగా జమ్మూకశ్మీర్‌లో అంతా బాగుందంటూ మోదీ ప్రభుత్వం చెప్పుకొంటోందని అన్నారు. గత కొద్ది వారాలుగా ఒక్క జమ్మూ ప్రాంతంలోనే 11 ఉగ్రదాడి ఘటనలు జరిగాయన్నారు. మణిపూర్‌లోనూ పరిస్థితిలో పరిస్థితి కూడా మెరుగుపరడలేదని చెప్పారు. ప్రధాని ప్రపంచం మొత్తం తిరుగుతారే కానీ మణిపూర్ వెళ్లేందుకు, సాధారణ పరిస్థితి నెలకొల్పేందుకు మాత్రం ఇష్టపడటం లేదని విమర్శించారు.

**నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు...**

మరి కొద్ది నెలల్లో నాలుగు రాష్ట్రాలకు ఎన్నికలు జరగనున్నాయని, లోక్‌సభ ఎన్నికలో చేకూరిన బలం, సాధించిన విజయాల ప్రేరణతో మనమంతా ముందుకు వెళ్లాలని సోనియాగాంధీ పార్లమెంటు పార్టీ సమావేసంలో దిశానిర్దేశం చేశారు. మితిమీరిన ఆత్మవిశ్వాసం మాత్రం ఉండకూడదని అన్నారు. పార్టీ పనితీరు బాగుంటే లోక్‌సభ ఎన్నికల ట్రెండ్స్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ పునరావృతమవుతాయని తాను కచ్చితంగా చెప్పగలని అన్నారు. జాతీయ రాజకీయాల్లో మార్పు సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

## కులాంతర వివాహాలు చేసుకున్న వారు అందరి కులాలను ప్రశ్నిస్తున్నారు




లోక్‌సభలో కాషాయ నేతలు కులాల ప్రస్తావన తీసుకురావడంపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే విస్మయం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ కులంపై బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ వ్యాఖ్యలు పెనుదుమారం రేపిన క్రమంలో ఈ వ్యవహారంపై ఖర్గే స్పందించారు. పార్లమెంట్‌లో కులాల ప్రస్తావన సరైంది కాదని, రాహుల్ గాంధీని అవమానించేందుకే అనురాగ్ ఠాకూర్ మాట్లాడారని, ఇది సరైంది కాదని చెప్పారు. ఎంతోమంది సీనియర్ బీజేపీ నేతలు కులాంతర వివాహాలు చేసుకున్నారని, ఈ విషయం వారు గుర్తెరగాలని అన్నారు. ముందు మీరు అద్దంలో చూసుకుని ఇతరుల గురించి మాట్లాడాలని కాషాయ నేతలకు ఖర్గే హితవు పలికారు. అనురాగ్ ఠాకూర్ అపరిపక్వతతో మాట్లాడితే దాన్ని ప్రధాని మోదీ ట్వీట్ చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు.

పలువురు బీజేపీ నేతలు కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్నారు..వారు ప్రతిఒక్కరి కులం గురించి అడుగుతారా..? ఇది తప్పని, దీన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని ఖర్గే పేర్కొన్నారు. ప్రధాని మోదీ ట్వీట్‌ను కూడా తాను ఖండిస్తున్నానని చెప్పారు. ఎక్కడ మాట్లాడాలి, దేన్ని సమర్ధించాలనేది ప్రధాని మోదీ తెలుసుకోవాలని హితవు పలికారు. ఈ విషయం పక్కనపెట్టి సెంటిమెంట్లను రగిలించేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పార్లమెంట్‌లో దీన్ని అనుమతించరాదని ఖర్గే స్పష్టం చేశారు.


## ఢిల్లీ సర్కార్ 'ఉచితాల సంస్కృతి'ని తప్పుపట్టిన హైకోర్టు




న్యూఢిల్లీ: ఢిల్లీ ఓల్డ్ రాజేంద్ర నగర్‌లోని ఐఏఎస్ కోచింగ్ సెంటర్ సెల్లార్‌లోకి వరద నీరు ముంచెత్తి ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటనపై బాధ్యులను ఢిల్లీ హైకోర్టుబుధవారంనాడు చీవాట్లు పెట్టింది. ఢిల్లీ ప్రభుత్వ "ఉచితాల సంస్కృతి" ని తప్పుపట్టింది. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఇన్వెస్టిగేటింగ్ అధికారిని శుక్రవారంనాడు తమ ముందు హాజరుకావాలని హైకోర్టు ఆదేశించింది. రాజేంద్ర నగర్ ప్రాంతంలోని డ్రైన్లపైనున్న అన్ని ఆక్రమణలను శుక్రవారంలోగా తొలగించాలని కూడా కోర్టు అదేశాలిచ్చింది. రాజేంద్ర నగర్ ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ న్యాయవాది రుద్ర విక్రమ్ సింగ్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యంపై విచారణ చేపట్టిన హైకోర్టు తాజా ఆదేశాలిచ్చింది. శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు విచారణను వాయిదా వేసింది. ఉచితాల సంస్కృతి కారణంగా మౌలిక వసతుల అప్‌గ్రేడేషన్‌కు, ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచేం దుకు ప్రభుత్వం వద్ద నిధులు లేకుండా పోతున్నాయని, సిటీ జనాభా మరోవైపు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతోందని యాక్టింగ్ చీఫ్ జస్టిస్ మన్మోహన్, జస్టిస్ తుషార్ రావు గేదెలతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. విచారణలో బాధ్యులను గుర్తించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. "బాధ్యులను తేల్చకుంటే ఇన్వెస్టిగేషన్‌ను సెంట్రల్ ఏజెన్సీకి మేము అప్పగించాల్సి వస్తుంది. ఇది చాలా సీరియస్ ఘటన. ఇది అతిపెద్ద ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బ్రేక్‌డౌన్. తొలుత ఇది నిర్లక్ష్యానికి సంబంధించిన కేసు" అని ధర్మాసనం విస్పష్టంగా పేర్కొంది. కేసుకు సంబంధించిన అన్ని ఫైల్స్‌తో డీసీపీ, ఎంసీడీ కమిషనర్ శుక్రవారం 2.30 గంటలకు కోర్టు ముందు హాజరుకావాలని ఆదేశించింది. ఢిల్లీ ప్రభుత్వం, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని కోర్టు విమర్శించింది. వందల ఏళ్ల నాటి మౌలిక సదుపాయాలు ఎందుకు మెరుగుపరచడం లేదని నిలదీసింది. ఆ పనే చేసి ఉంటే సెల్లార్‌లోకి నీళ్లు ఎలా వెళ్లేవని ప్రశ్నించింది. అధికారుల దివాళాకోరుతనం, బాధ్యతారాహిత్యం స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొంది.

## మహిళల, చిన్నారుల భద్రతకు రూ.13,412కోట్లు ఖర్చు..

**ఢిల్లీ:** దేశంలో మహిళల భద్రత కోసం వివిధ పథకాలు, కార్యక్రమాల కింద కేంద్ర ప్రభుత్వం రూ.13,412కోట్లు ఖర్చు చేస్తోందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ లోక్ సభలో వెల్లడించారు. మహిళా భద్రతా పథకాల కింద మహిళలు, పిల్లలపై లైంగిక వేధింపుల కేసులను నిర్వహించే పరిశోధకులతోపాటు ప్రాసిక్యూటర్ల సామర్థ్యం పెంపొందించేందుకు శిక్షణ ఇచ్చే నిబంధన ఉందా?, ఏయే కార్యక్రమాలు అమలు చేస్తున్నారంటూ ఎంపీ నీరజ్ శేఖర్ అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ బదులిచ్చారు. ప్రధాని మోడీ ఆదేశాల మేరకు హెూంమంత్రి ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారుల రక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దానికి సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రి సభలో వెల్లడించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ఇంటర్ ఆపరేబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ కోసం రూ.3,375 కోట్లు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ కోసం రూ.531.24కోట్లు, స్కీం ఫర్ మోడర్నైజేషన్ ఆఫ్ ఫోరెన్సిక్‌కు రూ.280 కోట్లు, జైళ్ల ఆధునీకరణకు రూ.950కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే రాష్ట్రాల సైన్స్ ఫోరెన్సిక్ లాబరేటరీల పటిష్టత కోసం రూ.106.75కోట్లు, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీలు, ఫోరెన్సిక్ డేటా సెంటర్, 6 సెంట్రల్ ఫోరెన్సిక్




సైన్స్ ల్యాబొరేటరీల ఆధునికీకరణకు మరో రూ.354.25కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే సేఫ్ సిటీ ప్రాజెక్టు కోసం రూ.2,840కోట్లు, మహిళలకు శిక్షణ, సామర్థ్యం పెంపు కోసం రూ.76.5కోట్లు, పేద ఖైదీల కోసం రూ.60కోట్లు, మానవ అక్రమ రవాణా నిరోధక(యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్) యూనిట్ కోసం రూ.113.76కోట్లు, మహిళా హెల్ప్ డెస్కులకు రూ.164.2 కోట్లు, చంఢీగడ్‌లో డీఎన్‌ఏ ల్యాబ్ ఏర్పాటుకు రూ.42.84 కోట్లు, మహిళలు, చిన్నారులపై సైబర్ నేరాల నియంత్రణకు రూ.224.76కోట్లు, సెంట్రల్ విక్టిమ్ కాంపోజిషన్ ఫండ్ కోసం రూ.200కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. ఢిల్లీ పోలీస్ స్కీమ్ ఫర్ ప్రొవైడింగ్ ఫెసిలిటీ ఆఫ్ సోషల్ వర్కర్స్ , కౌన్సిలర్స్, న్యూ బిల్డింగ్ ఫర్ విమెన్ సెంట్రిక్ ఫెసిలిటీస్, స్పెషల్ నీడ్స్ ఫర్ విమెన్ అండ్ చిల్డ్రన్ కోసం రూ.38.8కోట్లు, నేషనల్ ఫోరెన్సిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ పథకానికి రూ.2254కోట్లు, మొత్తంగా రూ.13,412కోట్లు మన అమ్మలు, అక్కలు, చెల్లెళ్లు, బిడ్డల కోసం కేంద్రం ఖర్చు పెడుతున్నట్లు కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వివరించారు.

## గోవాలో మద్యపానాన్ని నిషేధించండి.. బీజేపీ ఎమ్మెల్యే డిమాండ్



**పనాజీ:** గోవాలో మద్యపానాన్ని నిషేధించాలని బీజేపీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న మద్యపానం కారణంగా రోడ్డు ప్రమాదాలు, పారిశ్రామిక యూనిట్లలో ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజలు మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే మిగతా బీజేపీ ఎమ్మెల్యేలు ఆయన డిమాండ్‌ను వ్యతిరేకించారు. నార్త్ గోవాలోని మాయెమ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తొలిసారి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే ప్రేమేంద్ర షెట్, మంగళవారం అసెంబ్లీలో మాట్లాడారు. 'వికసిత్ భారత్, వికసిత్ గోవా' కోసం గోవాలో మద్యం వినియోగాన్ని నిషేధించాలని అన్నారు. 'రాష్ట్రంలో మద్యం ఉత్పత్తి చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయవచ్చు. కానీ గోవాలో మద్యం వినియోగాన్ని నిషేధించాలి' అని అన్నారు. కాగా, బీజేపీ ఎమ్మెల్యే ప్రేమేంద్ర షెట్ డిమాండ్‌ను తోటి బీజేపీ ఎమ్మెల్యేలు తిరస్కరించారు. పర్యాటకులు గోవాకు రావడానికి మద్యం కూడా ఒక కారణమని కొందరు ఎమ్మెల్యేలు తెలిపారు. గోవాలో రెస్టారెంట్ వ్యాపారాలను మూసివేయాలని షెట్ కోరుకుంటున్నారా? అని పలు హెూటల్స్ నిర్వహిస్తున్న బీజేపీ మహిళా ఎమ్మెల్యే డెలిలా లోబో ప్రశ్నించారు. గోవాలో మద్యాన్ని నిషేధించడం సాధ్యం కాదని ఆప్ ఎమ్మెల్యే క్రూజ్ సిల్వా అభిప్రాయపడ్డారు.

## కేరళకు ముందే చెప్పాం



**ఢిల్లీ:** కేరళలో కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య 185కి చేరగా, ఇంకా 225 మంది ఆచూకీ లభించలేదు. అయితే కేరళ విలయంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ముందుగానే హెచ్చరించామని కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. బుధవారం రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ.. జులై 23నే వయనాడ్ ప్రకృతి వైపరీత్యంపై సీఎం పినరయ్ విజయన్‌కి కేంద్ర బలగాలు హెచ్చరించాయని వెల్లడించారు. అయితే కేరళ ప్రభుత్వం ముందస్తు హెచ్చరికలను పట్టించుకోలేదని, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం బెటాలియన్‌ల రాకతో కూడా అప్రమత్తం కాలేదని విమర్శించారు. ఈ విషాద ఘటన తరుణంలో మోదీ ప్రభుత్వం కేరళ సర్కార్‌తోపాటు రాష్ట్ర ప్రజలకు అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తామని పేర్కొన్నారు. కొండచరియలు విరిగిపడే ఏడు రోజుల ముందే జులై 30న రాష్ట్రానికి ముందస్తు హెచ్చరికలు జారీ చేశామని, జులై 24న మరో హెచ్చరిక పంపినట్లు షా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే భారీగా ప్రాణ నష్టం జరిగిందని ఆయన ఆరోపించారు. అప్పటికే 9 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను కేరళకు పంపినట్లు వివరించారు. అయితే కేంద్రం ముందస్తు హెచ్చరికలతో ఒడిశా, గుజరాత్ సహా పలు రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయని, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్న వెంటనే కేరళ ప్రభుత్వం అప్రమత్తమై చర్యలు తీసుకుంటే ప్రాణ నష్టం తగ్గేదని తెలిపారు. అయితే ఇప్పటివరకు 185 మృతదేహాలను వెలికితీసినట్టు కేంద్ర హెూం వ్యవహారాల సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ చెప్పారు.

**శవాలదిబ్బగా ఊరు..**

కేరళవ్యాప్తంగా గత 5 రోజులుగా ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఎగువన కురుస్తున్న వర్షాలతో వయనాడ్ ప్రాంతానికి.. ముఖ్యంగా చాలియార్ నదికి వరద ఉద్ధృతి పెరిగింది. సోమవారం అర్ధరాత్రి 1.30 సమయంలో వరద బీభత్సానికి కొండ చరియలు విరిగిపడ్డాయి. ముండక్కై గ్రామాన్ని తుడిచిపెట్టేశాయి. ఆ గ్రామంలో 65 కుటుంబాలు నివసిస్తుండగా.. ఆ ఇళ్లలో నివసిస్తున్న వందలాది మంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న ప్రభుత్వం వెంటనే పోలీసులు, భద్రతా బలగాలను రంగంలోకి దింపింది. వర్షం, వరద, దట్టమైన పొగమంచు కారణంగా.. సహాయక బృందాలు ఆ ప్రాంతానికి చేరుకోవడంలో ఆటంకాలేర్పడ్డాయి. ఎలాగోలా కష్టపడి ఇప్పటివరకు 185 మృతదేహాలను బయటకి తీయగా.. ఇంకా పదుల సంఖ్యలో మృతదేహాలు మట్టి దిబ్బల్లో కూరుకుపోయాయి. అకస్మాత్తుగా జరిగిన ఈ పరిణామంతో గ్రామస్థులు ఎటూ కదల్లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో భారీగా ప్రాణ నష్టం జరిగింది. మట్టి దిబ్బల కింద కూరుకుపోయిన మృతదేహాలను గుర్తించడంలో అధికారులకు సవాళ్లు ఎదురవుతున్నాయి.

## కూటమి సర్కార్‌లో భగ్గుమన్న విభేదాలు




ఎన్డీయే కూటమిలో విభేదాలు భగ్గుమన్నాయి. ముడా, వాల్మీకి స్కామ్‌లపై సిద్ధరామయ్య సర్కార్‌కు వ్యతిరేకంగా బీజేపీ చేపట్టిన బెంగళూర్-మైసూర్ పాదయాత్రపై నీలినీడలు పరుచుకున్నాయి. పాదయాత్రపై ఎన్డీయే సంకీర్ణ సర్కార్ భాగస్వామి, జేడీఎస్ అసంతృప్తి వ్యక్తం చేసింది. తమను బీజేపీ పరిగణనలోకి తీసుకోకుండా నిర్ణయం తీసుకుంటే తామెందుకు వారికి మద్దతు ఇవ్వాలని జేడీఎస్ నేత, కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ప్రశ్నించారు. పాదయాత్ర విషయంలో వారు తమ పట్ల ఎలా వ్యవహరించారు..వారేం సాధించడానికి ప్రయత్నిస్తున్నారని నిలదీశారు. బీజేపీ తీరు తనను బాధపెట్టిందని ఆయన పేర్కొన్నారు. ప్రీతం జే. గౌడ ఎవరు.. హెచ్‌డీ దేవెగౌడ కుటుంబాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించిన వారిలో ఆయన ఒకరని, ఆయనను బీజేపీ నేతలు తీసుకొచ్చి తనపక్కన కూర్చోపెట్టారని అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజ్వల్ రేవణ్ణ కేసులో ఆ పెన్‌డ్రైవ్‌ల పంపిణీకి బాధ్యులెవరు..హసన్‌లో జరిగిందంతా బీజేపీకి తెలియదా అని కుమారస్వామి అసహనం వ్యక్తం చేశారు. కాగా ముడా, వాల్మీకి స్కామ్‌ల విషయంలో సిద్ధరామయ్య నేతృత్వంలోకి కర్నాటక కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ పాదయాత్రను చేపట్టేందుకు సంసిద్ధమైంది. పదిరోజుల పాటు సాగే పాదయాత్ర ముగింపు సభకు బీజేపీ అగ్రనేతలను రప్పించేందుకు కాషాయ నేతలు ప్లాన్ చేస్తున్నారు.


# ఎల్ఆర్ఎస్‌కు పచ్చజెండా..

-మొదటిపేజీ తరువాయి

బుధవారం ఉత్తర్వులిచ్చింది. గ్రామ పంచాయతీ మొదలు.. జీహెచ్ఎంసీ దాకా సిబ్బంది, ఉన్నతాధికారులకు ఇందుకు సంబంధించిన విధులను నిర్దేశించింది. దీంతో 2020 నుంచి పెండింగ్‌లో ఉన్న 25 లక్షల దరఖాస్తులకు మోక్షం కలగనుంది.

### నాలుగు దశల్లో వడపోత

పెండింగ్/కొత్త దరఖాస్తులను సుపరిపాలన కేంద్రం(సీజీజీ) రూపొందించిన అప్లికేషన్ ద్వారా పరిశీలిస్తారు. ఈ సాఫ్ట్‌వేర్‌లో దరఖాస్తులను నిషేధిత భూములతో పోల్చి.. ఒకవేళ ఆ జాబితాలో ఉంటే తిరస్కరిస్తారు. ఆ తర్వాత సంబంధిత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, నీటిపారుదల శాఖ ఏఈ, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ లేదా పంచాయతీ ఈవో లేదా స్థానిక సంస్థల సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. దరఖాస్తులో పేర్కొన్న భూములు ప్రభుత్వ, వక్ఫ్, దేవాదాయ, అసైన్డ్ భూములు, జలవనరుల ఫిల్ ట్యాంక్ లెవెల్(ఎఫ్‌టీఎల్)లో ఉన్నాయా? అనే విషయాన్ని పరిశీలిస్తారు. వీరి వద్ద ఉండే మొబైల్ యాప్ ద్వారా జీపీఎస్ వివరాలతోపాటు స్క్రూటినీ చేస్తారు. వీరు పంపే దరఖాస్తులను నీటిపారుదల, రెవెన్యూ లేదా టౌన్‌ప్లానింగ్ అధికారులు పరిశీలిస్తారు. ఈ ముగ్గురూ ఆయా దరఖాస్తులను తిరస్కరించవచ్చు లేదా ఆమోదించవచ్చు లేదా మార్పులతో మరోసారి దరఖాస్తుకు ఆదేశించవచ్చు. ఈ దశలో వడపోత తర్వాత డిప్యూటీ తహసీల్దార్లు, తహసీల్దార్లు పరిశీలిస్తారు. రెండో దశకు చేరుకునే దరఖాస్తులను టౌన్‌ప్లానింగ్ అధికారులు లేదా పంచాయతీ అధికారులు మాస్టర్‌ప్లాన్, రోడ్ల విస్తరణ నిబంధనలు, జోన్ నిబంధనలు, ఖాళీ స్థలాల వివరాలను పరిశీలించి.. అన్నీ సవ్యంగా ఉంటే.. లేఅవుట్లకు ఫీజును నిర్ణయిస్తారు. దరఖాస్తుదారులు నిర్ణీత ఫీజును



చెల్లించాక.. మూడోదశ వడపోతకు దరఖాస్తులు వెళ్తాయి. మూడో దశకు చేరిన దరఖాస్తులను మునిసిపల్ కమిషనర్లు, పట్టణాభివృద్ధి సంస్థల వైస్ చైర్మన్లు, అదనపు కలెక్టర్లు(స్థానిక సంస్థలు) పరిశీలిస్తారు. దరఖాస్తులో లోపాలుంటే తిరస్కరిస్తారు. వీరు ఆమోదించే దరఖాస్తులు నాలుగోదశకు చేరుతాయి. నాలుగోదశలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కమిషనర్లు.. జిల్లాల్లో కలెక్టర్లు పరిశీలించి ఆమోదిస్తారు. ఈ అన్ని దశల్లో క్షేత్రస్థాయి బృందం ఇచ్చే నివేదిక అత్యంత కీలకమైనది.

### నేడు సీఎస్ సమీక్ష

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ఉన్నతాధికారులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) గురువారం సమీక్ష నిర్వహించనున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే ఈ సమీక్షలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కమిషనర్లు, కలెక్టర్లు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు, పంచాయతీరాజ్, రెవెన్యూ, నీటిపారుదల అధికారులకు సీఎస్ సూచనలు చేయనున్నారు. మునిసిపాలిటీలు, జిల్లాల స్థాయిలో హెల్ప్‌డెస్కుల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేయనున్నారు.

# కొందరు ఎమ్మెల్యేల సభ్యత్వాలు రద్దు!

-మొదటిపేజీ తరువాయి

శాసనసభ సభ్యత్వాల రద్దుపై బీఆర్ఎస్ నేతలకు పరోక్ష హెచ్చరికలు జారీ చేశారు. 'ఈ సంప్రదాయం మన దగ్గర ఇప్పటికే వచ్చింది కదా?' అని వ్యాఖ్యానించారు. శాసనసభలో గత ప్రభుత్వం తీసుకువచ్చిన రకరకాల సంప్రదాయాల్లో ఏ సంప్రదాయాన్నయినా మనం తీసుకోవచ్చునన్నారు. అలాగే.. "నన్ను కాంగ్రెసలోకి రమ్మని ఆహ్వానించిన సబితక్క.. నాకు అండగానిలబడకుండా బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లిందంటే ఈ తమ్ముణ్ని అనాథను చేసినట్లే కదా?" అని సీఎం వ్యాఖ్యానించారు. అలాగే 2018 ఎన్నికల్లో సునీతక్క తరఫున ప్రచారానికి వెళితే అప్పటి ప్రభుత్వం తనపై రెండు కేసులు పెట్టించిందన్నారు. కౌడిపల్లి, నర్సాపూర్ పోలీస్ స్టేషన్లలో ఆ కేసులు ఇప్పటికీ ఉన్నాయన్నారు. తాను కేసుల చుట్టూ తిరుగుతూ ఉంటే.. సునీతక్క మాత్రం మహిళా కమిషన్ చైర్మన్ పోస్టు తీసుకుని, ఆ తర్వాత ఎమ్మెల్యే కూడా అయ్యారన్నారు. అక్కల మాట నమ్మి మోసపోవద్దనే తాను శాసనసభలో కేటీఆర్‌కు చెప్పానని, వారి పేర్లు ఎక్కడా ప్రస్తావించలేదని వివరించారు. రేవంత్‌ను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకువచ్చినందుకు తన కొడుకుకు రాజేంద్రనగర్ టిక్కెట్టు రాకుండా ఉత్తమ్ అడ్డుపడ్డారన్న సబిత వ్యాఖ్యలపై స్పందిస్తూ.. అప్పుడు పొత్తులో భాగంగా రాజేంద్రనగర్ సీటు టీడీపీకి కేటాయించారని గుర్తు చేశారు. 2014ఎన్నికల్లో సబితక్కకు కాంగ్రెస్ పార్టీ టిక్కెట్టు ఇవ్వలేదని, కానీ 2018 ఎన్నికల్లో టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. పెద్ద మనసు చేసుకుని ఆమెకు టిక్కెట్టు ఇచ్చారన్నారు. ఉత్తమ్‌పైన ఆమె ఆ ఔదార్యం ఎందుకు చూపట్లేదని ప్రశ్నించారు. సబితక్కకు సభలో నిజంగా అవమానం, అన్యాయం జరిగితే.. ఆమె ఆవేదన చెందితే.. సభకు వచ్చి అండగా నిలబడాల్సిన కేసీఆర్, హరీశ్‌రావు ఎందుకు దుమ్మా కొట్టారని ప్రశ్నించారు. తన పార్టీ సభ్యులను పట్టించుకోకుండా కేసీఆర్ ఎందుకు పత్తా లేకుండా పోయారని ప్రశ్నించారు. "సభలో మాట్లాడేందుకు కేటీఆర్, హరీశ్ చాలనుకుంటే.. బీఆర్ఎస్ శాసనసభాపక్ష నేతగా కేసీఆర్‌ను ఎందుకు పెట్టుకున్నట్లు? ఆ పదవి నుంచి ఆయన్ను తొలగించండి!" అని సూచించారు. శాసనసభ నడపడంలో తాము ప్రజాస్వామ్యబద్ధంగానే వ్యవహరిస్తున్నామని స్పష్టం చేసిన సీఎం.. బడ్జెట్, డిమాండ్లపై చర్చ సందర్భంగా బీఆర్ఎస్ సభ్యులకు అనుకున్న దాని కంటే



ఎక్కువ సమయమే ఇచ్చామన్నారు.

### సభలో వాగ్యుద్ధం..

ద్రవ్య వినిమయ బిల్లుపై బుధవారం అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా సీఎం రేవంత్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ మధ్య మాటల యుద్ధం జరిగింది. "కృత్రిమమేధకు, కేటీఆర్‌కు పోలిక ఏమిటంటే.. కేటీఆర్ 100 శాతం ఆర్టిఫీషియల్, సున్నా ఇంటెలిజెన్స్" అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. దీనికి ఘాటుగా స్పందించిన కేటీఆర్.. తనను అలా అన్నా బాధ లేదని, తనను తన తండ్రి బాగా చదివించారని, తనకు రెండు డిగ్రీలు ఉన్నాయని, రేవంత్ ఏం చదివారో మాత్రం తనకు తెలియదని వ్యాఖ్యానించారు. తొలుత కేటీఆర్ మాట్లాడుతూ.. మగ్గంపై మళ్లీ మరణ మృదంగం మోగుతోందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సిరిసిల్లలో ఇప్పటివరకు 15 మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. బతుకమ్మ చీరల పంపిణీని, గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీని నిలిపివేశారన్నారు. దీనికి రేవంత్.. "కేటీఆర్ సభను తప్పుదోవ పట్టించటానికి సమయాన్ని వినియోగించుకుంటున్నారు. సూచన అనే ముసుగులో మోసం అనే ప్రణాళికను ప్రజల మెదళ్లలో జొప్పిస్తున్నారు. బతుకమ్మ చీరల పథకంలో అవినీతి జరిగింది. నేత కార్మికులకు పని కల్పించామంటూ అబద్ధాలు చెప్పారు. పథకాన్ని ప్రారంభించిన 2017-18 సంవత్సరంలో సూరత్ నుంచి చీరలు తెప్పించారు. కిలోల కొద్దీ చీరలను కొని, కమీషన్లు దండుకున్నారు. సిరిసిల్ల నేతన్నలకు రూ.275కోట్లు బకాయి పడ్డారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.100కోట్లు చెల్లించాం" అని వ్యాఖ్యానించారు. అలాగే.. తాము ఫార్మాసిటీ అనకుండా ఫార్మా విలేజెస్ అంటున్నామని.. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తర్వాత అక్కడి 4000 ఎకరాల్లో నాల్గో సిటీని అభివృద్ధి చేస్తున్నామని, స్కిల్ వర్సిటీ, స్పోర్ట్స్ వర్సిటీ, హెల్త్ టూరిజం హబ్‌ను ఏర్పాటుచేసి ప్రపంచస్థాయి వైద్యాన్ని అందుబాటులోకి తెస్తున్నామని వెల్లడించారు. కేసీఆర్ చీల్చి చెండాడుతానని అనడంతో తాము సభకు బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ వేసుకుని వచ్చామని ఎద్దేవా చేశారు. రెండు గంటలపాటు మాట్లాడిన కేటీఆర్.. విషం చిమ్మడం తప్ప ప్రజలకు మేలు చేసేలా మాట్లాడలేదని ఆరోపించారు. ఇలాగైతే ప్రజలు వారిని సభలో కూడా ఉండనివ్వరని వ్యాఖ్యానించారు. దీనికి కేటీఆర్.. అదృష్టం బాగుండి రేవంత్ సీఎం అయ్యారని వ్యాఖ్యానించారు. గతంలో ఆయన, తాను మంచి స్నేహితులమేనని.. కానీ, గత పదేళ్లుగా చెడిందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన రేవంత్‌ను ఏకవచనంతో సంబోధించడంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. దీంతో ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నానని కేటీఆర్ చెప్పాల్సి వచ్చింది. మళ్లీ రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... తాను రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నానని, గుంటూరులో చదువుకోలేదని.. 610 జీవో, ముల్కీ రూల్స్ ప్రకారం ఉద్యోగాలకు కేటీఆర్‌కు అర్హత లేదని అన్నారు. ఇందుకు కేటీఆర్.. 610 జీఓ, ముల్కీ రూల్స్ ప్రభుత్వ ఉద్యోగాలకు అవసరమని, తాను ప్రైవేటు రంగంలో ఉద్యోగం చేశానని బదులిచ్చారు. మొదటి సంవత్సరం పాక్షికంగా సూరత్ నుంచి బతుకమ్మ చీరలను తెప్పించిన మాట వాస్తవమేనని పేర్కొన్నారు.

### బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వచ్చినంతమాత్రాన..

బీఆర్ఎస్ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు తన వద్దకు వచ్చి అరగంట పాటు కూర్చుని వెళ్లారని, చాలా విషయాలు తనతో మాట్లాడారని సీఎం రేవంత్ వెల్లడించారు. తన వద్దకు వచ్చి వెళ్లినంత మాత్రాన వారు ఇటు వచ్చేసినట్లు కాదన్నారు. అలాగే తమవాళ్లు కేటీఆర్‌ను కలిసినంత మాత్రాన అటు పోయినట్లు కాదన్నారు. గద్వాల ఎమ్మెల్యే తిరిగి బీఆర్ఎసలో చేరనున్నారన్న వార్తలపై సీఎం ఇలా స్పందించారు.

## సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదు

-మొదటిపేజీ తరువాయి

సమాధానం ఇచ్చారు. గనుల కేటాయింపులో పారదర్శకత ఉండేందుకే వేలం ప్రక్రియను చేపడుతున్నామని, ఇందులో ప్రభుత్వాలతో పాటుగా ప్రైవేటు సంస్థలు కూడా పాల్గొంటాయని చెప్పారు.

### ప్రధాని మోదీకి ఎంపీ బాలశౌరి ధన్యవాదాలు..

కేంద్ర బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాధాన్యత ఇచ్చి వివిధ రైల్వే ప్రాజెక్టుల కోసం రూ.9,151 కోట్లు కేటాయించినందుకు ప్రధాని మోదీకి మచిలీపట్నం ఎంపీ బాలశౌరి ధన్యవాదాలు తెలిపారు. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణానికి కేంద్రం నుంచి నిధులు రావాలని, రాష్ట్ర రాజధాని అమరావతికి రైల్వే అభివృద్ధి పనుల నిమిత్తం మరిన్ని నిధులు కావాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. మచిలీపట్నం – నర్సాపురం రైల్వే లైన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, ముఖ్యంగా మచిలీపట్నం – రేపల్లె రైల్వే లైన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ లైన్‌ను నిర్మిస్తే దివిసీమ ప్రజానీకానికి ఉపయోగకరంగా ఉంటుందని అభిలాష వ్యక్తం చేశారు. గుడివాడ నియోజకవర్గం వడ్లమన్నాడు రైల్వే స్టేషన్‌లో కొన్ని రైళ్లకు స్టాప్‌లు ఇవ్వాలని ఎంపీ బాలశౌరి కోరారు. గతేడాది అక్టోబర్‌లో నిలిచిపోయిన మచిలీపట్నం నుంచి తిరుపతి వయా ధర్మవరం రైలు సర్వీసును భక్తుల కోరిక మేరకు పునరుద్ధరించాలని ఎంపీ బాలశౌరి అభ్యర్థించారు.

## సీఎం రేవంత్ నోటికొచ్చింది మాట్లాడుతున్నడు..

### సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం



ముఖ్యమంత్రి రేవంత్ నోటికొచ్చింది మాట్లాడుతున్నాడని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ అసెంబ్లీలో ద్రవ్య వినిమయ బిల్లు అనంతరం సభ రేపటికి వాయిదాపడింది. అనంతరం సీఎం వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ సభ్యులు సభలాబీ నుంచి మీడియా పాయింట్ వరకు నిరసన వ్యక్తం చేశారు. ఆ తర్వాత మీడియా పాయింట్ వద్ద సబితా ఇంద్రారెడ్డి కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సభలో తన పేరును ప్రస్తావించి.. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని.. దొంగల్లా పారిపోయారంటూ మండిపడ్డారు. సభలో సభ్యులను అవమానిస్తున్నారని.. ఏం మొహం పెట్టుకొని వచ్చారంటారా?.. పార్టీ మారానని అడిగి హక్కు మీకెక్కడిదంటూ నిలదీశారు. తాను పార్టీ మారలేదని.. గెంటివేశారన్నారు. దేశంలో చాలామంది పార్టీలు మారుతారన్నారు. రేవంత్‌రెడ్డికి మహిళలు అంటే గౌరవం లేదని.. అక్కలను నమ్ముకుంటే జూబ్లీ బస్టాండ్ అవుతుందననారు. మీ వెనకున్న అక్కలే మిమ్మల్ని ముంచారని సీఎం అన్నారని.. మిమ్మల్ని కూడా ముంచుతారని కేటీఆర్‌తో సీఎం అన్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి నోటికి ఏదొస్తే మాట్లాడుతున్నారన్నారు. సోనియా మొదలు సబిత వరకు అందరిపై సీఎం ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని.. మహిళలపై సీఎంకు గౌరవం లేదు.. ఏం మాట్లాడాలో కూడా తెలియదన్నారు. రేవంత్ కాంగ్రెస్‌లోకి రాకముందే ఆ పార్టీకి మేం సేవలందించామన్నారు. నేను, సునీత పార్టీకి మోసం చేశామని రేవంత్ మాట్లాడారన్నారు. రేవంత్‌ను కాంగ్రెస్‌లోకి రావాలని కోరడమే నేను చేసిన తప్పు అన్నారు. ఆడబిడ్డలు, క్షేమం కోరుకుంటారు.. నమ్మిచన వారికి ప్రాణం ఇస్తారని.. ఈ రోజు జరిగిన అవమానం సునీత, సబితకు మాత్రమే కాదన్నారు. సభలో జరిగిన దానిపై ప్రతి ఇంట్లోని ఆడపిల్లలు ఆలోచిస్తున్నారని.. సీఎం రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

### సభలో సబితను అవమానించారు : సునీతా లక్ష్మారెడ్డి

ఆ రోజు నిండుసభలో ద్రౌపదిని అవమానించారని.. ఈ రోజు సభలో సబితను అవమానించారని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం మాటలు మహిళలను గాయపరుస్తున్నాయని.. చేసిన తప్పునకు సీఎం, డిప్యూటీ సీఎం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో రాష్ట్ర మహిళలను అగౌరవపరిచేలా మాట్లాడారని.. మాకు మాట్లాడే అవకాశం కల్పిస్తారనుకున్నామని.. సభలో మాకు మైక్ ఇవ్వకుండా మా గొంతులు నొక్కేశారన్నారు. పార్టీ మారారని అంటున్నవాళ్లు ఏ పార్టీ నుంచి వచ్చారో ఆలోచించుకోవాలని హితవు పలికారు. తనను, సబిత, డీకే అరుణను పార్టీ నుంచి పంపించింది మీరు కాదా? అంటూ నిలదీశారు. కాంగ్రెస్‌లో మహిళలకు గౌరవం లేదని.. కాంగ్రెస్ పార్టీని మేం చేశామని సీతక్క అంటుందని.. సీతక్క ఏ పార్టీ నుంచి వచ్చిందంటూ సునీతా లక్ష్మారెడ్డి ప్రశ్నించారు.

## తెలంగాణ గవర్నర్‌గా ప్రమాణ చేసిన జిష్ణుదేవ్ వర్మ..

-మొదటిపేజీ తరువాయి



గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం పలువురు కిషన్‌రెడ్డి సహా మంత్రులు గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఇదిలా ఉండగా.. గవర్నర్‌గా ప్రమాణస్వీకారం చేసిన జిష్ణుదేవ్ వర్మ 2018 నుంచి 2023 వరకూ త్రిపుర రాష్ట్ర డిప్యూటీ సీఎంగా పని చేశారు. గతంలో బాడ్మింటన్ అసోషియేషన్ ఆఫ్ ఇండియాకు అధ్యక్షుడిగా సేవలందించారు. ఈయన త్రిపుర రాజ కుటుంబానికి చెందిన వారు కాగా.. రామ జన్మభూమి ఉద్యమ సమయంలో పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో 1990లో బీజేపీలో చేరారు. ఆయన అప్పటి నుంచి ఆ పార్టీలో కీలకంగా వ్యవహరిస్తూ వచ్చారు. త్రిపుర ప్రభుత్వంలో ఆయన మంత్రిగా విద్యుత్, గ్రామీణాభివృద్ధి, పంచాయితీ రాజ్, ఆర్థిక, ప్రణాళిక, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణ శాఖల బాధ్యతలను నిర్వర్తించారు. ఈ క్రమంలో ఆయనకు బీజేపీ నేతృత్వంలోని కేంద్ర సర్కారు గవర్నర్ పదవిని కట్టబెట్టింది.

# ప్రయివేటు రంగంలో ఉద్యోగానికి 610 జీవో, ముల్కీ రూల్స్ అవసరం లేదు



**హైదరాబాద్ , శుభ తెలంగాణ :** ప్రయివేటు రంగంలో ఉద్యోగాలకు 610 జీవో, ముల్కీ రూల్స్ అవసరం లేదని, అవి కేవలం ప్రభుత్వ ఉద్యోగాలకు మాత్రమే వర్తిస్తాయని సీఎం రేవంత్ రెడ్డికి సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ చురకలంటించారు. శాసనసభలో ద్రవ్య వినియమ బిల్లుపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి పాలసీలు తెస్తామన్నారు కానీ ఇప్పటి వరకు ఒక్క కొత్త పాలసీ తేలేదు. కేసీఆర్ అంటే జలసీ తప్ప.. ఏ పాలసీ తేలేదు. మహేశ్వరంను న్యూయార్క్‌లా, మూసీని లండన్ థేమ్స్ నదిలా మారుస్తాం అని రేవంత్ రెడ్డి అన్నారు. ఇక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అన్నారు. ఎవరి ఇంటెలిజెన్స్ ఏంటో ప్రజలు తేల్చుతారు. నేను చదువుకుని వచ్చాను. నేను రెండు మాస్టర్ డిగ్రీలు చదివాను. పుణెలో మాస్టర్స్‌లో బయోటెలక్నాలజీ చేశాను. న్యూయార్క్ వెళ్లి ఎంబీఏ చేశాను. గుంటూరులో కూడా ఇంటర్ చదివాను. అంతటా చదివాను. సర్టిఫికెట్లు చూపే పరిస్థితి నాకుంది. రేవంత్ రెడ్డిని ఉద్దేశించి.. వారు ఎక్కడ చదువుకున్నారో నాకు తెల్వదు. ఏం చదువుకున్నారో తెల్వదు. నేనైతే కష్టపడ్డాను.. ఉద్యోగం సంపాదించాను. అదే ఉద్యోగం మీద ఇండియాకు వచ్చాను. మరి నాకు ఇంటెలిజెన్స్ ఉందా లేదా అంటే నేను పోటీ పరీక్షలు రాశాను. ఇంటర్వ్యూలు అటెండ్ అయ్యాను. ముఖ్యమంత్రి గతం గురించి నాకు తెల్వదు కానీ ఆయన గురించి రకరకాలుగా చెప్తారు. ఎవరి ఇంటెలిజెన్స్ ఏందో అందరూ విన్నారు అని కేటీఆర్ పేర్కొన్నారు.

### పదేండ్ల క్రితం రేవంత్ మంచి స్నేహితులు..


ఇక రేవంత్ రెడ్డి చాలా అదృష్టవంతులు. చిన్న వయసులోనే సీఎం అయ్యారు. ఆయన గురించి గొప్పగా చెబుతున్నాను. రేవంత్ రెడ్డి దాదాపు 18 ఏండ్ల నుంచి నాకు తెలుసు. మంచి మిత్రులు.. చాలాసార్లు బయట మాట్లాడుకున్నాం. గత 10 ఏండ్లలో చెడింది.. అదే వేరే విషయం అని కేటీఆర్ తెలిపారు. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని.. నేను కొండారెడ్డిపల్లి, తాండ్ర, వనపర్తి, హైదరాబాద్‌లో ప్రభుత్వ విద్య అభ్యసించాను. నేనేం జ్ఞానం కోసం పక్క రాష్ట్రాలకు పోలేదు. గుంటూరు కూడా పోలేదు. 610 జీవో, ముల్కీ రూల్స్ అప్లై చేసినా.. తెలంగాణలోని ప్రతి ఉద్యోగానికి నాకు అర్హత ఉంది. మరి గుంటూరులో చదువుకున్న వారికి అర్హత ఉందో లేదో తెలియదు అని రేవంత్ వ్యాఖ్యానించారు. వెంటనే కేటీఆర్ స్పందిస్తూ.. గుంటూరులో 11, 12 చదివాను. విజ్ఞాన్‌లో చదివాను అనే విషయం చెబుతూనే ఉన్నాను. దాచడం లేదు. కానీ ప్రయివేటు రంగంలో ఉద్యోగం సంపాదించాను. 610 జీవో ప్రయివేటు రంగంలో వర్తించదు.. కేవలం ప్రభుత్వ రంగంలోని ఉద్యోగాలకు మాత్రమే వర్తిస్తుందన్న విషయం గ్రహించాలని రేవంత్ రెడ్డికి కేటీఆర్ చురకలంటించారు.

# లవంగాలు తింటే ఏం జరుగుతుంది?



మన వంటింట్లో దొరికే మసాలా దినుసులలో లవంగాలు కూడా ఒకటి. లవంగాల వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి అన్నా విషయం మనందరికి తెలిసిందే. వీటిని ఎన్నో రకాల వంటకాలలో ఉపయోగిస్తూ ఉంటారు.వీటిని వంటల్లో ఉపయోగించడం వల్ల కూరకు రుచి పెంచడంతో పాటు ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలను కూడా చేకూరుస్తుంది. ఈ లవంగాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అనేక రకాల అనారోగ్య సమస్యల నుంచి కూడా బయటపడవచ్చు. అయితే ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్న ఈ లవంగాలను డయాబెటిస్ పేషెంట్లు తినవచ్చా తినకూడదా? ఈ విషయం గురించి నిపుణులు ఏమంటున్నారో ఇప్పుడు మనం తెలుసుకుందాం..యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉన్న లవంగాలు డయాబెటిస్ పేషెంట్లకు దివ్య ఔషధంలా పనిచేస్తుందని చెబుతున్నారు. ఈ లవంగాల్లో ఉండే పోషకాలు జీవక్రియ సమస్యలను తగ్గిస్తాయట. అదేవిధంగా మన శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయని, దాంతో మన శరీరం ఎన్నో రోగాలకు దూరంగా ఉంటుందని చెబుతున్నారు. కాగా లవంగాల్లో ఫైబర్, కాల్షియం, మాంగనీస్, ఐరన్ వంటి పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ఇవి మన ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఎంతగానో ఉపయోగపడతాయి. ఇది మన శరీరానికి అవసరమైన శక్తిని అందించడానికి సహాయపడతాయి. కాగా లవంగాలు డయాబెటిస్ పేషెంట్ల శరీరంలో ఇన్సులిన్ సున్నితత్వాన్ని ప్రోత్సహించడానికి సహాయపడుతుందట.మధుమేహులు లవంగాలను ఇన్సులిన్ హార్మోన్లు, జీవక్రియ, శక్తిని ప్రేరేపించడానికి రోజూ లవంగాలను తినవచ్చు. సాధారణంగా డయాబెటిస్ ఉన్నవారు ఇన్సులిన్ సున్నితత్వాన్ని పెంచడానికి లవంగాలు తినడం మంచిదని చెబుతున్నారు. అలాగే ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడానికి సహాయపడుతుందట. కాగా లవంగాలను ఆహారంలో తీసుకోవడం వల్ల గుండె జబ్బుల ప్రమాదం చాలా వరకు తగ్గుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. రోజుకు కనీసం 1.5 గ్రాముల లవంగాలు తింటే శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయని చెబుతున్నారు. ఇన్ఫ్లుయెంజా, డెంగ్యూ దోమల ద్వారా వ్యాపించే వైరల్ ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని తగ్గించడంలో లవంగాలు చాలా ఎఫెక్టీవ్ గా పనిచేస్తాయని చెబుతున్నారు. ఈ లవంగాలను తింటే శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుందట. ఇకపోతే లవంగాలు తరచూ తీసుకోవడం వల్ల కడుపు రుగ్మతలు, వాంతులు, వికారం వంటి జీర్ణ సమస్యలను నయం చేయడానికి కూడా సహాయపడతాయని చెబుతున్నారు.

# అల్జీమర్స్ సమస్యకు ఇలా చెక్!




అల్జీమర్స్, పార్కిన్సన్స్ తరచుగా ప్రజలను ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా 40 ఏళ్లు పైబడిన వారు సులభంగా ఈ వ్యాధుల బారిన పడుతున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా వైద్యులు ఈ వ్యాధులకు సరైన మందు కనుగొనలేకపోయారు. అయితే ఇప్పుడు దీనికి సంబంధించి షాకింగ్ రిపోర్ట్ వచ్చింది. దాని నివారణ పిల్లి మలంలో దాగి ఉందని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. శాస్త్రవేత్తల ప్రకారం.. పిల్లి మలంలో టాక్సోప్లాస్మా గోండి అనే పదార్థం కనిపిస్తుంది. ఇది అల్జీమర్స్ (%ూశ్రీఓష్ట్రవఱవవతీం%), పార్కిన్సన్స్ చికిత్సలో ఉపయోగించవచ్చు. టాక్సోప్లాస్మా గోండి అనేది ఒక రకమైన ప్రోటీన్. ఇది మెదడులో డోపమైన్ స్థాయిని పెంచుతుంది. ఇది అల్జీమర్స్, పార్కిన్సన్స్ నుండి సులభంగా బయటపడవచ్చు. ఎలుకలపై పరిశోధన చేసిన తర్వాత శాస్త్రవేత్తలు ఈ విషయాన్ని నిర్ధారించగలరు. ఇంతకు ముందు చాలాసార్లు అల్జీమర్స్, పార్కిన్సన్‌లకు నివారణను కనుగొనే ప్రయత్నాలు జరిగాయి. కానీ మెదడులోని నిరోధిత న్యూరాన్‌లకు చికిత్స అందించడం సాధ్యం కాలేదు. ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్ ఓడెడ్ రెచావి ప్రకారం.. మన మెదడును నియంత్రించే పదార్థాన్ని శాస్త్రవేత్తలు మొదటిసారిగా కనుగొన్నారు. కొత్త విషయాలను కనిపెట్టే బదులు ఇప్పటికే అందుబాటులో ఉన్న వాటిపై దృష్టి పెట్టాలని నేను భావిస్తున్నాను. శాస్త్రవేత్తల ప్రకారం.. టాక్సోప్లాస్మా గోండి అనే పదార్థం అల్జీమర్స్, పార్కిన్సన్స్ మందులలో ఉపయోగించవచ్చు. ఈ మూలకాలు జీర్ణవ్యవస్థ నుండి మెదడుకు వెళ్లి న్యూరాన్‌లకు ప్రోటీన్‌ను అందిస్తాయి. అయితే దీని వినియోగం గర్భిణీ స్త్రీలకు హానికరం. అల్జీమర్స్, పార్కిన్సన్స్, రెట్ సిండ్రోమ్ వంటి వ్యాధులు ప్రోటీన్ లోపంతో సంబంధం కలిగి ఉన్నాయి. అయినా ఇలా ఎందుకు జరుగుతుంది? శాస్త్రవేత్తలు ఇప్పటికీ దీనికి సమాధానం కనుగొనలేదు. అల్జీమర్స్, పార్కిన్సన్స్ మెదడు సంబంధిత వ్యాధులు. అల్జీమర్స్‌లో జ్ఞాపకశక్తి క్రమంగా తగ్గుతుంది. పార్కిన్సన్‌లో మెదడు నెమ్మదిగా పని చేస్తుంది. జ్ఞాపకశక్తి కోల్పోవడం, సరిగ్గా మాట్లాడలేకపోవడం, రోజువారీ కార్యకలాపాల్లో ఇబ్బంది వంటి అంశాలు అల్జీమర్స్ లక్షణాలలో పరిగణించబడతాయి. పార్కిన్సన్స్ లక్షణాల గురించి మాట్లాడుకుంటే.. ఇది వణుకు, కండరాల దృఢత్వం, నెమ్మదిగా మెదడు పనితీరును కలిగి ఉంటుంది.

# చక్కెర మానేస్తే ప్రయోజనాలున్నాయా?




చక్కెర ఒక కార్బోహైడ్రేట్. శరీరానికి శక్తిని అందించేందుకు మూలం. పండ్లు, పాల ఉత్పత్తులు తీసుకున్నప్పుడు వాటిలోని చక్కెరను బాడీ విచ్ఛిన్నం చేస్తుంది. ఎనర్జీగా మారుస్తుంది. అయితే ఇలా నేచురల్ ఫ్రూట్స్, మిల్క్ ప్రొడక్ట్స్ కాకుండా ఆర్టిఫీషియల్ షుగర్ కంటెంట్ తీసుకున్నట్లయితే ఆరోగ్యం ప్రతికూలంగా ప్రభావితం అవుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను పెంచి మధుమేహం వ్యాధికి దారితీస్తుంది. మరిన్ని దీర్ఘకాలిక ఎఫెక్ట్స్ చూపుతుంది. అలా కాకుండా పంచదార తీసుకోవడం మానేస్తే ఏం జరుగుతుందో తెలుసుకుందాం. షుగర్ తీసుకోవడం తగ్గించడం మొదలుపెడితే ఆటోమేటిక్ గా బరువు తగ్గడం స్టార్ట్ అయిపోతుంది అంటున్నారు నిపుణులు. ఎందుకంటే చక్కెరలో ఎక్కువ మొత్తంలో ఉండే కేలరీలు.. ఆకలిని పెంచుతుంది. అధికంగా తినడానికి కారణం అవుతుంది. అందుకే దీన్ని తీసుకోవడం ఆపేస్తే ఆకలి తగ్గి.. తక్కువ ఆహారం తీసుకుంటారు. బరువు నియంత్రణలో ఉంటుంది. చక్కెర తీసుకున్నప్పుడు రక్తంలో గ్లూకోజ్ స్థాయిలలో పెరుగుదల క్రాష్ లకు కారణం అవుతుంది. తద్వారా శక్తిస్థాయిలలో హెచ్చుతగ్గులు ఏర్పడుతాయి. అదే అసలు మీ ఆహారంలో చేర్చుకోలేకపోతే స్థిరమైన గ్లూకోజ్ లెవెల్స్ మెయింటైన్ అవుతాయి. ఇది రోజంతా స్థిరమైన శక్తిని అందిస్తుంది. అధిక చక్కెర తీసుకోవడం మొటిమలు, రోసేసియా వంటి చర్మ పరిస్థితులకు దారితీస్తుంది. వాపు, మంటను పెంచుతుంది. షుగర్ తీసుకోనప్పుడు ఇవేవీ ఉండవు. స్కిన్ మెరిసిపోతుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు చక్కెర తగ్గించడం బెస్ట్ ఆప్షన్. కొలెస్ట్రాల్ స్థాయిలను త గ్గించి.. గుండె జబ్బులకు దారితీసే కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గిస్తుంది. అధిక పంచదార వినియోగం కాగ్నిటివ్ ఫంక్షన్ ను ప్రభావితం చేస్తుంది. బ్రెయిన్ ఫాగ్ కు దారితీస్తుంది. గ్లూకోజ్ స్థాయిలు సరిగ్గా మెయింటైన్ అవుతుండటం వల్ల.. ఫోకస్ పెరుగుతుంది. అభిజ్ఞా పనితీరు మెరుగుపడుతుంది. చిరాకు, ఆందోళన తగ్గించి.. మానసికంగా ఉల్లాసంగా ఉండేందుకు హెల్ప్ చేస్తుంది. మూడ్ బూస్ట్ చేస్తూ డిప్రెషన్ లక్షణాలు తగ్గిస్తుంది.

# పాదాల విషయంలో జాగ్రత్తలు..



ఈరోజుల్లో అనేకమందిని వేధిస్తున్న ఆరోగ్య సమస్యల్లో డయాబెటిస్ ఒకటి. ప్రపంచ వ్యాప్తంగా దీని కారణంగా 15 శాతం మంది ఇన్ఫెక్షన్లు సోకి ఫుట్ అల్సర్లకు గురవుతున్నారని, పాదాలను తొలగించుకుంటున్న పరిస్థితిని ఏర్పడుతోందని నివేదికలు పేర్కొంటున్నాయి. పాదాలకు గాయాలు కావడం, పరిశుభ్రత పాటించకపోవడం, సాక్సులు వేసుకునే ముందు జాగ్రత్తలు తీసుకోకపోవడం వంటివి ఇందుకు కారణం అవుతున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. ఏ విధమైన కేర్ తీసుకోవాలో సూచిస్తున్నారు.డయాబెటిక్ పేషెంట్లలో పాదాలు రంగు మారడం, చీలమండ వాపు, కాళ్లల్లో నొప్పి, పుండ్లు ఏర్పడటం, గోర్లు ఎక్కువగా పెరగడం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. ఇలాంటి వారు సాక్స్ వేసుకునే ముందు జాగ్రత్త తీసుకోవాలి. ముఖ్యంగా డైలీ అవే సాక్సులు అస్సలు వాడకూడదు. ఉతికినవి లేదా కొత్తవి వాడాలని నిపుణులు సూచిస్తున్నారు.డయాబెటిక్ ఫుట్ ప్రాబ్లమ్స్ ఎదుర్కొంటున్న వారు పాదాలను డైలీ గోరు వెచ్చని నీరు, సబ్బుతో శుభ్ర పర్చుకోవాలి. స్నానం చేసినప్పుడు, వర్షంలో తడిసి వచ్చినప్పుడు పాదాలపై తడిలేకుండా వెంటనే తుడుచుకోవాలి. లేకుంటే ఫంగల్ ఇన్ఫెక్షన్లు డెవలప్ కావచ్చు.కాలి గోర్లను కత్తిరించేటప్పుడు శు భ్రమైన నెయిల్ కట్టర్‌ను మాత్రమే వాడాలి. ఒకవేళ నొప్పిగా అనిపిస్తే గోర్లు తీయడం ఆపివేయాలి. తర్వాత డాక్టర్ల సలహా పాటించాలి. అలాగే పాదాలపై జిడ్డుతో ఇబ్బంది పడుతుంటే తడిగా ఉండే ప్యూమిస్ స్టోన్‌తో సున్నితంగా రుద్దడం ద్వారా తొలగించుకోవచ్చు.చెప్పులు లేదా షూలు వాడేటప్పుడు పాదాలకు సరిపడా పొడవు, వెడల్పు ఉండేలా చూసుకోవాలని నిపుణులు చెప్తున్నారు. లేకుంటే వాటి రాపిడివల్ల గాయాలు, పుండ్లు ఏర్పడవచ్చు. అలాగే పాదాలలో రక్త ప్రసరణ సక్రమంగా ఉండాలంటే డైలీ 30 నిమిషాలు ఫిజికల్ యాక్టివిటీస్ ఉండేలా చూసుకోవాలి.

# జీడిపప్పు ఎక్కువగా తింటున్నారా?



జీడిపప్పు అంటే తెలియని వారుండరు. అందరికీ ఇష్టమైన డ్రైఫ్రూట్ ఇది. జీడిపప్పు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. జీడిపప్పులో అనేక విటమిన్లు, ఇతర పోషకాలు ఉంటాయి.అలాగే ఎవరికైనా ఆరోగ్య సంబంధిత సమస్యలు ఉంటే జీడిపప్పు నయం చేస్తుంది. అయితే జీడిపప్పు ఎక్కువగా తినడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ వేగంగా పెరుగుతుందని కొందరు నమ్ముతారు. దీని వెనుక ఉన్న నిజం తెలుసుకుందాం. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. జీడిపప్పు తినడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరగదు. ఎందుకంటే జీడిపప్పులో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. వేరుశెనగ, జీడిపప్పులో కొలెస్ట్రాల్ సున్నా. కొత్త అధ్యయనాల ప్రకారం.. ఆహార కొలెస్ట్రాల్ శరీరంపై గణనీయమైన ప్రభావాన్ని చూపదని పేర్కొంది.జీడిపప్పు ఆరోగ్యకరమైన డ్రై ఫ్రూట్స్. ఇందులో విటమిన్ ఇ, విటమిన్ కె, విటమిన్ బి6, జింక్, ప్రొటీన్, మెగ్నీషియం, ఫాస్పరస్, ఐరన్, ఫైబర్ పుష్కలంగా ఉన్నాయి. గుండె ఆరోగ్యంగా ఉండేందుకు జీడిపప్పు చాలా మేలు చేస్తుంది. జీడిపప్పులో మోనోఅన్‌శాచురేటెడ్, పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి, ఇవి చెడు (ఎల్‌డిఎల్) కొలెస్ట్రాల్‌ని తగ్గించడంలో సహాయపడతాయి. ఇటీవలి పరిశోధనల ప్రకారం.. జీడిపప్పు తినడం వల్ల ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్ పెరగదు. హెచ్‌డిఎల్ కొలెస్ట్రాల్ పెరుగుతుంది. జీడిపప్పులో అనేక యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి అనేక వ్యాధులను దూరం చేస్తాయి. జీడిపప్పు తినడం వల్ల రక్తనాళాలు కూడా సక్రమంగా పనిచేస్తాయి. జీడిపప్పును రోజూ తినడం వల్ల బిపి, ట్రైగ్లిజరైడ్ స్థాయి, కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. జీడిపప్పు తినడం వల్ల మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. పరిశోధనల ప్రకారం జీడిపప్పులో ఉండే విటమిన్లు శరీరానికి మేలు చేస్తాయి. ఇది శరీరం వాపు, తిమ్మిరిని నయం చేస్తుంది. ఇందులో సహజ చక్కెర ఉంటుంది. స్త్రీలు తప్పనిసరిగా జీడిపప్పు తినాలి. ఇలా చేయడం వల్ల రోజంతా ఎనర్జిటిక్ గా ఉంటారు.

# రేవంత్ అన్‌ఫిట్ సీఎం

**హైదరాబాద్, శుభ తెలంగాణ :** 'అకారణంగా, అసభ్యంగా, హీనాతిహీనమైన రీతిలో మహిళలను అవమానించిన రేవంత్‌రెడ్డి.. అన్‌ఫిట్ ముఖ్యమం త్రి! ఆ పదవికి తగడు' అంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'ఈ అక్కలను నమ్ముకుంటే పార్టీని ముంచారు.. నన్ను ముం చారు.. రేపు నిన్ను కూడా నట్టేట ముంచుతరు.. ఇగ జూ బ్లీ బస్టాండ్‌లో కూసున్నట్టే' అంటూ రేవంత్‌రెడ్డి మాట్లాడడం హేయం, దారుణమని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఇది ఒక ముఖ్యమంత్రి స్థాయికి తగని మాట, ఇది ఒక్క సబితక్కకో, సునితక్కకో, లక్ష్మక్కకో జరిగిన అవమానం కాదు.. యావత్ తెలంగాణ ఆడబిడ్డలకు జరిగిన అవమానం! తక్షణమే రాష్ట్ర మహిళలకు రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలి' అని డిమాండ్ చేశారు. కేటీఆర్ బుధవారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి అసెంబ్లీ మీ డియా పాయింట్ వద్ద మాట్లాడారు. 'ఎందుకు నోరు పారేసుకున్నడో తెలియదు.. కండకావరంతో మాట్లాడిన రేవంత్‌రెడ్డికి ఆడబిడ్డల ఉసురు తాకుతది' అంటూ ఫైర్ అయ్యారు. సబితక్క, సునితక్క, లక్ష్మక్క స్వశక్తితో ఎదిగారని, రేవంత్‌లాగా జిమ్మిక్కులతో పదవిలోకి రాలేదని, వీళ్లంతా ప్రజల్లో తిరిగి మూడు నాలుగుసార్లు గెలిచి వ చ్చారని, సబితక్క 5సార్లు గెలిచిన విషయాన్ని గుర్తుంచుకొని మాట్లాడాలని సూచించారు. మహిళలను పట్టుకొని నోటికొచ్చినట్టు వాగడం సరికాదని హితవుపలికారు. 'ఆడబిడ్డలను పట్టుకొని ఏ ముఖం పెట్టుకొని వచ్చారంటారా? డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఏ ధైర్యంతో అలా మాట్లాడుతున్నరు.. మరి మీరేముఖం పెట్టుకొని వచ్చారు?' అంటూ నిలదీశారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, తక్షణమే సీఎం, డిప్యూటీ సీఎం బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**నేడు దిష్టిబొమ్మ దహనాలకు పిలుపు**

సీనియర్ మహిళా శాసనసభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిపై సీఎం చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. 'తెలంగాణ సంస్కృతిలో ఆడబిడ్డలకు ప్రత్యేక గౌరవం, స్థానం ఉన్నదన్న కనీస సోయిలేకుండా అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి తన స్థాయిని మరిచి చేసిన నీచమైన వ్యాఖ్యలను ప్రతి ఒకరూ ఖండించాల్సిన అవసరం ఉన్నది' అని పేర్కొన్నారు. సుదీర్ఘకాలం ప్రజల మన్ననలు అందుకుంటూ ప్రజలు, కార్యకర్తల ఆశీర్వాదంతో, అనేక త్యాగాలతో ప్రజాసేవ చేస్తున్న ఇద్దరు సీనియర్ మహిళా సభ్యులపై అహంకారంతో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ఆడబిడ్డలందరి మనసులను నొప్పించాయని, జీవితంలో ఎదగాలనుకుంటున్న ప్రతి ఆడబిడ్డకు ఆ వ్యాఖ్యలు అవమానకరమని కేటీఆర్ ధ్వజమెత్తారు.

# కేటీఆర్.. రెచ్చగొట్టకు..

-మొదటిపేజీ తరువాయి

రూ. 16వేల కోట్లతో మేము ప్రతిపాదనలు సిద్ధం చేశాం. కానీ ఇప్పుడు లక్షన్నర కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వార్తలు వచ్చాయి. ఎందుకు ప్రతిపాదన పెరిగిందో డీపీఆర్ సబ్మిట్ చేయాలి..?' అని అసెంబ్లీ వేదికగా కేటీఆర్ డిమాండ్ చేశారు. మాజీ మంత్రి మాట్లాడిన ప్రతి విషయంపైనా సీఎం రేవంత్ రెడ్డి ఓ రేంజిలో స్పందిస్తూ స్ట్రాంగ్ కౌంటర్లు ఇచ్చారు.



**కుట్ర ఏంటి..?**

' కేటీఆర్ రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. మోసం అనే ప్రణాళికలు అమలు చేస్తున్నారు. పదేళ్లు ఏలిన మీరు పది నెలలు నిండని ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారు. బతుకమ్మ పథకాన్ని ప్రారంభించిన ఏడాది సిరిసిల్లలో నేతన్నలు ఆ చీరలు నేశారా?. మీ బినామీలకు కాంట్రాక్టు ఇచ్చి సూరత్ నుంచి తూకంలో తెచ్చారా?. కమిషన్లు కొట్టి పేదలను మోసం చేశారా.. లేదా?. ఎంఎంటీస్‌ను ఎయిర్ పోర్ట్‌లోనికి ఎందుకు అనుమతి ఇవ్వలేదు..? దీని వెనుక ఉన్న కుట్ర ఏంటి?. ముచ్చర్ల భూ సేకరణపై వారే ఊహించుకుంటున్నారు. హుస్సేన్ సాగర్ నీళ్లను కొబ్బరి నీళ్లలా మారుస్తానని మీలా నేనెప్పుడూ అబద్ధాలు చెప్పలేదు' అని రేవంత్ రెడ్డి ప్రశ్నలు సంధిస్తూ కన్నెర్రజేశారు.

**కేటీఆర్ సవాల్..**

కాగా.. అంతకుముందు కేటీఆర్ వర్సెస్ మంత్రుల మధ్య మాటల యుద్ధం సాగింది. ద్రవ్య వినిమయ బిల్లుపై అసెంబ్లీలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. బడ్జెట్‌లో కోతలు, ఎగవేతలతో మసిబూసి మారేడుకాయ చేశారు. రైతు భరోసాకు బడ్జెట్ ఏదని ప్రశ్నించారు. పెన్షన్ డబుల్ చేసే కేటాయింపులు ఎక్కడని ప్రశ్నించారు. కాంగ్రెస్ తీరు ఎన్నికల ముందు రజినీకాంత్, తర్వాత గజినీకాంత్‌లా ఉందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణ పోరాటాల గడ్డ.. మభ్యపెడితే ఊరుకోదని కేటీఆర్ అన్నారు. చార్జిషీట్లు, రికవరీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై వేయాలన్నారు. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు కేటీఆర్ సవాల్ ఒకటి విసిరారు. అశోక్ నగర్, చిక్కడపల్లి లైబ్రరీకి వెళదామని.. ఒక్క కొత్త ఉద్యోగం ఇచ్చినట్లు యువకులు చెబితే అక్కడే రాజీనామా చేయడమే కాదు.. రాజకీయ సన్యాసం చేస్తానంటూ కేటీఆర్ ఛాలెంజ్ చేశారు. పైగా రేవంత్, భట్టికి పౌర సన్మానం కూడా చేస్తామని తెలిపారు.

**కౌంటర్లే కౌంటర్లు!**

ఈ క్రమంలోనే మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలు ఒక్కొకటి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. మేము చేయకపోతే ప్రజలే మాకు బుద్ధి చెబుతారన్నారు. కొంచెం ఓపికగా ఉండాలని తెలిపారు. దీనికి తిరిగి కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. ఓపికగా ఉండాల్సింది మంత్రులు అని.. తాము కాదని కేటీఆర్ పేర్కొన్నారు. వంద రోజులలో ఇచ్చిన హామీలు అమలు చేస్తామని ఎవరు చెప్పమన్నారని ప్రశ్నించారు. పోస్టులు పెంచమంటే పోలీసులతో దౌర్జన్యం చేస్తున్నారని పేర్కొన్నారు. సన్నాసులు గ్రూప్ 2 వాయిదా వేయమంటున్నారని సీఎం రేవంత్ అవమానిస్తున్నారని కేటీఆర్ తెలిపారు. జీవో 46సవరించి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఇక కేటీఆర్ వ్యాఖ్యలకు శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్ సత్యదూరంగా మాట్లాడుతున్నారని.. బీఆర్ఎస్ కూడా మాకు పోటీగా హామీలు ఇచ్చిందన్నారు. కానీ ప్రజలు మిమ్మల్ని నమ్మలేదన్నారు. కాంగ్రెస్ తోనే మార్పు సాధ్యం అని ప్రజలు నమ్మారన్నారు. మమ్మల్ని గెలిపించారని.. మిమ్మల్ని ప్రతిపక్షంలో కూర్చోబెట్టారన్నారు. దళితుడిని సీఎం చేస్తామని చెప్పి ఆ హామీని తుంగలో తొక్కారన్నారు. వారికి సామాజిక న్యాయం గురించి మాట్లాడే హక్కు ఉందా? అని శ్రీధర్ బాబు ప్రశ్నించారు. మొదటి బడ్జెట్‌కే ఇంత భయపడితే.. మరో నాలుగు బడ్జెట్‌లు ప్రవేశ పెడితే ఎంత భయపడతారని శ్రీధర్ బాబు ప్రశ్నించారు.

# బీసీల లెక్కలు తీయకపోతే పార్టీల లెక్కలు తేలుస్తాం

## సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు శేఖర్ సగర





**కరీంనగర్, శుభ తెలంగాణ :** తెలంగాణ రాష్ట్రంలో బీసీల లెక్కలు తీయకపోతే ప్రభుత్వాలు రాజకీయ పార్టీల లెక్కలు బీసీలందరం ఏకమై తేలుస్తామని తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర అన్నారు. గత పక్షం రోజుల క్రితం కామారెడ్డిలో ప్రారంభమైన సమగ్ర కులగణన సాధన యాత్ర బుధవారం కరీంనగర్ లో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సభలో శేఖర్ సగర మాట్లాడుతూ తెలంగాణలో సమగ్ర కుల గణన చేపట్టి బీసీల రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతామని తెలంగాణ సాధారణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. కూలగణన చేపడతామని క్యాబినెట్ నిర్ణయం తీసుకొని అసెంబ్లీలో తీర్మానం చేసినప్పటికీ కులగణన చేపట్టడానికి తాత్సారం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. సమగ్ర కులగణన చేపట్టడం ద్వారా కొన్ని ఆధిపత్య కులాల భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందనే భయంతోనే కొన్ని రాజకీయ పార్టీల నాయకులు కుల గణనను చేపట్టకుండా కుట్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల లోపల కులగణన పూర్తి చేసి 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్లు




వేయించుకొని అధికారంలోకి రావడం కోసమే అబద్ధపు ప్రచారం చేసిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వెంటనే సమగ్ర కుల గణన చేపట్టి తెలంగాణలో బీసీల రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలకు పోవాలని డిమాండ్ చేశారు. కులగణన చేపట్టకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు పోతామని ప్రభుత్వం ముందుకెళితే ఇక రాజకీయ పార్టీల లెక్క ఏమిటో బీసీలంతా ఏకమై తేల్చుడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. స్వాతంత్రం వచ్చిన నాటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ నుంచి మొదలుకొని నేటి వరకు అన్ని రాజకీయ పార్టీలు ఆయా పార్టీల నాయకులు బీసీలను మోసం చేస్తూ అధికారం కోసం బీసీలను కేవలం ఓటర్లుగా వాడుకొని వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక భవిష్యత్తులో ఇదే విధానాన్ని అవలంబిస్తామంటే అన్ని రాజకీయ పార్టీలకు తగిన బుద్ధి చెప్పక తప్పదని అందుకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీలందరూ ఏకమవ్వడానికి సిద్ధమవ్వాల్సిందేనని పిలుపునిచ్చారు. త్వరలో హైదరాబాదులో లక్ష మంది బీసీల మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సగరులంతా తరలి రావడానికి సిద్ధమేనని తెలియజేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎన్నం ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బిసి కులాల ఐక్యవేదిక చైర్మన్ కుందారం గణేశా చారి, కన్వీనర్ బాలగోని బాల్రాజ్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరి రవికృష్ణ గౌడ్, రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి విభాగం అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, జాతీయ యువజన సంఘం అధ్యక్షులు శ్యాంకుర్మ, బిసి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు బర్ల మణిమంజరి సగర తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి...

-జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, శుభ తెలంగాణ:** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ప్రజా పాలన, అంగన్వాడి, గ్రామపంచాయతీలో చేపడుతున్న భవనాల పురోగతి, ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులు, పారిశుధ్యం తదితర అంశాలపై ఎంపీడీవోలతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా పాలనలో భాగంగా వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు పొందేలా చూడాలన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా గ్యాస్ సబ్సిడీ, గృహ జ్యోతి ద్వారా విద్యుత్తు సున్నా బిల్లు కు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు, లబ్ధి పొందుతున్న సంఖ్య ఎంత అనే వాటిపై దృష్టి సారించి వాటిని లబ్ధిదారులకు పొందలేని పక్షంలో సాకేత సాంకేతిక లోపాలను సరిచేసి వారం రోజుల్లో అర్హులైన వారికి పథకాలు వర్తించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఏవేని సమస్యలు ఉంటే పరిష్కరించేందుకుగాను సిబ్బందికి మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆగస్టు 20 లోపు అంగన్వాడి లలో చేపడుతున్న మరమ్మత్తులు, పెయింటింగ్ పనులను పూర్తి అయ్యేలా ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో నాణ్యమైన ఫ్యాన్లను ఏర్పాటు చేయాలని, అదేవిధంగా వెంటిలేటర్లకు మెస్ (జాలి)లను అమర్చాలని కలెక్టర్ సూచించారు. గ్రామపంచాయతీలలో అసంపూర్తిగా ఉన్న వివిధ భవన నిర్మాణ పనుల వివరాలను సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టి పూర్తి చేసిన పనుల వివరాలతో పాటు పనులు చేపట్టకు ముందు, పూర్తి అయిన తర్వాత తీసిన ఫోటోలను సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల్లో భాగంగా ఎస్సీ, ఎస్టీ భూములను యుద్ధ ప్రాతిపదికన చదును చేసే విధంగా పనులను చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 37 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వ పాఠశాలల ప్రహరీ గోడ నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలకు కలెక్టర్ సూచించారు. వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా చేపట్టిన పనులకు సంబంధించి చెల్లింపులపై ఆరా తీశారు. పనులు పూర్తి అయినప్పటికీ చెల్లింపులో జ్యాప్యం ఎందుకని సంబంధిత ఇంజనీర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తయిన వాటికి త్వరితగతిన చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ఇంఛార్జ్ అదనపు కలెక్టర్ సుధీర్, డిఆర్ డిఓ శ్రీనివాస్, డిపిఓ జయసుధ, సిపిఓ అశోక్ కుమార్, ఇంచార్జ్ డిడబ్ల్యూఓ వెంకటేశ్వరమ్మ, మిషన్ భగీరథ ఇఇ బాబు శ్రీనివాస్, డిఎల్పిఓ లు సంధ్యారాణి, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అధికారులు ఎక్కడ పని చేసిన ప్రజాసేవే లక్ష్యంగా పని చేయాలి...

-జిల్లా ఎస్పీ కే. నారాయణ రెడ్డి



**వికారాబాద్, శుభ తెలంగాణ:** జిల్లాలో సిబ్బంది సాధారణ బదిలీలలో భాగంగా బుధవారం జిల్లా ఎస్పీ 7 మంది లు, 6 మంది హెడ్ కాన్స్టేబుల్ లు మరియు 49 మంది పోలీస్ కాన్స్టేబుల్ లను కౌన్సిలింగ్ ఏర్పాటు చేసి బదిలీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులు గతం లో పని చేసిన పోలీస్ స్టేషన్ వివరాలు, సీనియరిటీ లిస్ట్ ప్రకారం కౌన్సిలింగ్ ఏర్పాటు వారికీ పోస్టింగ్ లు ఇవ్వడం జరిగింది. ఈ సందర్బంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బాధ్యతగా పని చేసి జిల్లా పోలీస్ కి మంచి పేరు తీసుకోని రావాలి, పోలీస్ అధికారులు ఎక్కడ పని చేసిన ప్రజాసేవే లక్ష్యంగా పని చేయాలి. ప్రజాలకు మేమున్నాం అని భరోసా కల్గించి, పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులను ప్రశాంతమైన వాతావరణం కల్గించి వారికీ పోలీస్ అధికారులు ఉన్నారనే నమ్మకం కల్గించాలని జిల్లా ఎస్పీ కే. నారాయణ రెడ్డి తెలిపినారు. ఇట్టి కార్యక్రమం లో జిల్లా అదనపు ఎస్పీ %ఖ%. రవీందర్ రెడ్డి , %ూూ% జోతిర్మనీ గారు, %ణూదీ% ఇన్స్పెక్టర్ %ణవూ% రాజు గారు, %దీ% సెక్షన్ సూపరింటెండెన్ మోహనప్ప, జిల్లా పోలీస్ ప్రసిడెంట్ టి. అశోక్ గారు, %ూూ×, ఎజ, ాజ% అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మహేశ్వరం ఎమ్మెల్యేను అసెంబ్లీలో అగౌరవపరిచేలా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలి:

## శంకర్‌పల్లి మండల సొసైటీ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి

**శంకర్‌పల్లి , శుభ తెలంగాణ:** మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అసెంబ్లీలో అగౌరవపరిచేలా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని శంకర్‌పల్లి మండల సొసైటీ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి బుధవారం విలేకరులతో మాట్లాడుతూ సీఎం మాటలకు నిరసనగా నేడు మండల మరియు మున్సిపల్ కేంద్రంలో పెద్ద ఎత్తున ఆందోళన చేయాలని ఆయన బిఆర్ఎస్ నేతలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి గతం మరిచి మాట్లాడటం సరికాదన్నారు.

## శంకర్పల్లి మండలం మోకిల గ్రామంలో అక్రమ మద్యం స్వాధీనం : ఎస్సై కోటేశ్వరరావు

**శంకర్పల్లి, శుభ తెలంగాణ :** శంకర్పల్లి మండలంలోని మోకిలా గ్రామంలో నిర్వహిస్తున్నటువంటి కేకే ఫుడ్ కోర్ట్ లో ఈరోజు సాయంత్రం మోకిలా పోలీసులు అక్రమంగా అమ్ముతున్న మద్యాన్ని పట్టుకున్నారు. ఈ యొక్క కేకే ఫుడ్ కోర్ట్ నడుపుతున్నటువంటి వ్యక్తులు, రాజు, మరియు ప్రశాంత్ కుమార్ జానా,తండ్రి, బిరాబర్ జాన, వయసు 42 సంవత్సరాలు, వాళ్లని మోకిలా పోలీసులు పట్టుకుని సుమారుగా 50 నుంచి 60 బాటిల్స్ మద్యం బాటిల్ లను స్వాధీనపరుచుకున్నారు.

# అంతులేని కథ...



**కరీంనగర్, శుభ తెలంగాణ :** కాళేశ్వరం ప్రాజెక్ట్ పై మాటల మంటలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎలాగైనా ఆ ప్రాజెక్ట్ తో తెలంగాణ సస్యశ్యామలం అవుతుందని చెప్పుకోవాలన్న ఆరాటంలో బీఆర్ఎస్ ఉంది. అందుకే కేటీఆర్ సహా గులాబీ నేతల బృందం కాళేశ్వరం వెళ్లి పరిశీలించి వచ్చారు. అక్కడితో మ్యాటర్ ఆపకుండా కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రాజెక్టును దెబ్బతీశారని తనకు ఎప్పటినుంచో అనుమానం ఉందని కేటీఆర్ చెప్పడం ఇప్పుడు అసలు ట్విస్ట్.కాళేశ్వరంపై ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చాలా డైలాగ్ వార్ నడిచింది. కాళేశ్వరం తెలంగాణ వరప్రదాయిని అని బీఆర్ఎస్.. అప్పుల కుప్ప ఒక్క ఎకరాకూ నీళ్లు దక్కే పరిస్థితి లేదని కాంగ్రెస్ ఇలాంటివెన్నో మాటల యుద్ధాలు నడిచాయి. అసలు ప్రాజెక్టు తుమ్మడిహెట్టి దగ్గర కాకుండా కట్టడం, డిజైన్లు మార్చడం, నాసిరకం నిర్మాణాలం టూ కాంగ్రెస్ ఎదురుదాడులు చేసింది. అటు మేడిగడ్డ కుంగడంతో బీఆర్ఎస్ కూడా డిఫెండ్ చేసుకునేలా అన్ని ప్రయత్నాలు చేస్తూ వస్తోంది. తాజాగా ఇదే కాళేశ్వరంపై తెరపైకి వచ్చిన కొత్త విషయం ఏంటంటే.. గులాబీ నేతలు మొన్నామధ్య కాళేశ్వరం పర్యటనకు వెళ్లివచ్చారు.మాజీ మంత్రి కేటీఆర్ చేసిన కామెంట్స్ తో ఇప్పుడు మరోసారి ఈ ప్రాజెక్టు గురించి చర్చ మొదలైంది. అసలు కేటీఆర్ ఏమన్నారంటే.. మేడిగడ్డ 28 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని తట్టుకుని నిలబడిందని అలాంటిది? ఏ వరదా లేనప్పుడు ప్రాజెక్టు ఎలా కుంగిందని ప్రభుత్వాన్ని ప్రశ్నిం చారు. కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రాజెక్టును దెబ్బతీశారని తనకు ఎప్పటినుంచో అనుమానం ఉందంటూ మాట్లాడారు. రేపు ప్రాజెక్టుకు ఏదైనా జరగకూడనిది జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత అని, కాళేశ్వరాన్ని ఏదైనా చేస్తారనే డౌట్ కూడా ఉందన్నారు కేటీఆర్మాబట్టి కాళేశ్వరంపై కొత్త కథలను కేటీఆర్ ఎత్తుకున్నారు. ఇప్పటికే మేడిగడ్డ కుంగడం, అన్నారం, సుందిళ్లలో బుంగలు పడడం, ఎక్కువ నీటిని నిల్వ చేస్తే అసలుకే ప్రమాదం అని ఇప్పటికే ఔఆూం స్పష్టం చేసింది. దీంతో వరద వచ్చింది వచ్చినట్లు కిందికి వదిలేస్తున్నారు. అలాంటిది లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకున్న మేడిగడ్డ బరాజ్.. ఏ వరదా లేనప్పుడు ఎలా కుంగిందో అర్థం కావడం లేదంటూ కొత్త డౌట్లను తెరపైకి తేవడం అంతా పకడ్బందీ ప్లాన్ లో భాగమే అంటున్నారు. కాళేశ్వరం డ్యామేజ్ నుంచి సబ్జెక్ట్ డీవియేట్ చేయడమన్న వాదన వినిపిస్తోంది. గతేడాది అక్టోబర్ 21న మేడిగడ్డలోని ఏడో బ్లాక్ లోని నాలుగు పిల్లర్ల దగ్గర పెద్ద శబ్దంతో క్రాక్స్ వచ్చి పిల్లర్లు కుంగాయి.అప్పుడు బరాజ్ కుంగిపోవడానికి ముందు పేలుడు వంటి శబ్దం వచ్చిందన్న స్టోరీలు వినిపించారు. మహారాష్ట్ర వైపు నుండి 3 మీటర్ల దూరంలో 20వ పిల్లర్ వద్ద శబ్దం వచ్చిందన్నారు. మహారాష్ట్ర, తెలంగాణ మధ్య రవాణాకు సంబంధించి ఈ రెండు వ్యవస్థలు నిత్యం నిశిత పరిశీలన జరుపుతుంటాయి. అయినప్పటికీ మేడిగడ్డ కుంగుబాటును ఇంకేదో ఖాతాలో వేసుకుని తప్పించుకునే ప్రయత్నాలు అప్పుడు జరిగాయి. కానీ విద్రోహ చర్య ఏదీ లేదని అప్పట్లోనే నిపుణులు, భద్రతా సిబ్బంది తేల్చేశారు. ఔఆూం టీమ్ ఢిల్లీ నుంచి వచ్చి పరిశీలన జరిపి, కుంగుబాటుకు కారణాలు వెల్లడించింది. మధ్యంతర నివేదిక ఇచ్చింది. రిపేర్లు పూర్తయ్యేదాకా గేట్లు ఓపెన్ చేసి పెట్టాలన్నదిలక్ష కోట్ల రూపాయలతో కాళేశ్వరం కట్టారు. అసలు డిజైన్ చేసింది తానే అని ఒక సందర్భంలో కేసీఆర్ చెప్పుకున్నారు. మెదడు, రక్తం కరిగించి కట్టానన్నారు. బరాజ్ కుంగిన తర్వాత ప్రశ్న అడిగితే.. తనకు తెలియదని, అంతా ఇంజినీర్లదే అని అన్నారు. సో ఒక అబద్ధాన్ని నిజం చేయడం కోసం, అలాగే ఒక తప్పును కప్పి పుచ్చుకోవడం కోసం కొత్త వ్యూహాలకు బీఆర్ఎస్ నేతలు తెరలేపుతున్నారన్న వాదన వినిపిస్తోంది. కేసీఆర్ కుటుంబం కమిషన్ల కక్కుర్తి కోసం రాష్ట్ర నీటిపారుదలరంగాన్ని, కాళేశ్వరం ప్రాజెక్టును సర్వనాశనం చేసిందని కేసీఆర్, కేటీఆర్‌పై మంత్రి ఉత్తమ్ విరుచుకుపడ్డారు. కేటీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతూ.. ప్రజల్లో తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని, తప్పుడు ప్రచారంలో గోబెల్స్‌ను కేటీఆర్ మించిపోయారంటూ కౌంటర్ ఇచ్చారు. కాళేశ్వరం కట్టినప్పుడు.. కూలినప్పుడు అధికారంలో ఉన్నది కేసీఆర్ కుటుంబమే అన్న విషయాన్ని కేటీఆర్ కు గుర్తు చేశారు.కూలిన తర్వాత 45 రోజులు వారే అధికారంలో ఉన్నారన్నారు. రీ-డిజైనింగ్, రీ-ఇంజనీరింగ్ తోనే మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిపోయిందన్నారు. సో ఇప్పుడు గోదావరిలో వరద వస్తోంది. ఆ నీటిని ఎత్తి పోయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. నిజానికి ఎక్కడికి ఎత్తిపో యాలి.. ఎక్కడ నిల్వ ఉంచాలి.. నిల్వ ఉంచితే వచ్చే ప్రమా దాలు.. ఇవన్నీ తెలియవా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇంత చేసి కాళేశ్వరం టూర్ కు వెళ్లిన గులాబీ బ్యాచ్.. మేడిగడ్డలో తప్పు జరగలేదు అన్న విషయాన్ని కూడా చెప్పలేకపోయిందంటున్నారు కేంద్రమంత్రి బండి సంజయ్. కొండను తవ్వి ఎలుకను కూడా పట్టుకోలేకపో యారని అంటున్నారుఔఆూం రిపోర్ట్ బీజేపీ ఆఫీస్ లో తయారు చేసిందే అని, ఎన్డీఎస్ఏకు పోలవరంపై లేని శ్రద్ధ కాళేశ్వరంపై ఎందుకని కేటీఆర్ ఇటీవలే చేసిన కామెంట్లపై బండి మండిపడ్డారు. అయితే కాళేశ్వరంలో తప్పు జరిగిందని కేటీఆర్ ఒప్పుకున్నట్టేనా అని ప్రశ్నించారు. పోలవరానికి కాళేశ్వరానికి లింక్ ఎందుకన్నారు. పోలవరంలో తప్పు జరిగితే.. ఫిర్యాదు చేయాలని సూచించారు. అంతేగానీ.. కాళేశ్వరం తప్పులను నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ గుర్తిస్తే తట్టుకోలేకపోతున్నారంటున్నారు. కాబట్టి కాళేశ్వరం కథలకు ఇప్పట్లో ఫుల్ స్టాప్ పడేలా కనిపించడం లేదు. కౌంటర్లు, ఎన్ కౌంటర్లు, డౌట్లు, విచారణలు ఇవన్నీ మరింతకాలం కొనసాగడం ఖాయంగానే కనిపిస్తోంది.


# అసంతృప్తా...గొంతెమ్మ కోరికలా

**మహబూబ్‌నగర్ , శుభ తెలంగాణ:** బీఆర్ఎస్ పార్టీ ఘర్‌వాపసీ మొదలు పెట్టింది. కాంగ్రెస్ పార్టీకి ఝలక్ ఇస్తూ అందులో చేరిన తమ ఎమ్మెల్యేలను తిరిగి వెనక్కి తెచ్చుకునే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్టు తెలుస్తున్నది. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన నలుగురు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ ఫోకస్ పెట్టింది. ఆ నలుగురు ఎమ్మెల్యేలు త్వరలోనే గులాబీ గూటికి వస్తారని బీఆర్ఎస్ పెద్దలు చెబుతున్నారు. ఇప్పటికే ఒక ఎమ్మెల్యే తాను బీర్ఎస్ లోకి వచ్చినట్టు ప్రకటించగా.. మరో ఎమ్మెల్యే తాజాగా కేటీఆ ర్‌తో భేటీ అయ్యారు.భద్రాచల్లం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యలు బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలిచారు. వీరు ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే, బీఆర్ఎస్ ఘర్‌వాపసీ ఆపరేషన్ ప్రారంభించిందని, త్వరలోనే ఈ నలుగురు బీఆర్ఎస్ పార్టీలో చేరుతారని చెబుతున్నారు. గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి ఇప్పటికే తాను బీఆర్ఎస్‌లో చేరినట్టు ప్రకటించారు. ఇక భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ప్రశాంత్ రెడ్డితో కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో భేటీ అయ్యారు. త్వరలోనే ఆయన మళ్లీ బీఆర్ఎస్‌లోకి తిరిగి రాబోతున్నట్టు తెలుస్తున్నది. వీరితోపాటు జగిత్యాల ఎమ్మెల్యే సంజ్ కుమార్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యలు కూడా త్వరలోనే బీఆర్ఎస్ పార్టీలో చేరుతారని బీఆర్ఎస్ పెద్దలు చెబుతున్నారు.ఒకరి వెంట ఒకరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ బాటపట్టడంతో గులాబీ పార్టీ ఆందోళనకు గురైంది. దీనికితోడు లోక్ సభ ఎన్నికల్లోనూ



ఫలితాలు ఏమీ రాకపోవడంతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొంటున్నది. ఈ నేపథ్యంలోనే గులాబీ పెద్దలు కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది. ఘర్ వాపసీకి తెరలేపి పార్టీలో మళ్లీ ఒక కొత్త స్థైర్యాన్ని నింపే ప్రయత్నాలు చేస్తున్నట్టు అర్థం అవుతున్నది.పార్టీ మారిన ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ నాయకులు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఫిర్యాదులు చేశారు. హైకోర్టును కూడా ఆశ్రయించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావులపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ తదుపరి విచారణ వచ్చే నెల 1వ తేదీకి ఉన్నది. ఈ నేపథ్యంలో కీలక పరిణామాలు జరుగుతున్నాయి.ఖైరతాబాద్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ టికెట్ పై గెలిచి కాంగ్రెస్‌లో చేరారు. ఆ తర్వాత కాంగ్రెస్ టికెట్ పై సికింద్రాబాద్ పార్లమెంటు సీటుకు పోటీ చేసి ఓడిపోయారు. ఇక కడియం శ్రీహరి బీఆర్ఎస్ టికెట్ పై గెలిచి కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ వరంగల్ లోక్ సభ టికెట్ కడియం శ్రీహరి కూతురు కడియం కావ్యకు ప్రకటించిన తర్వాత తిరస్కరించారు. ఇద్దరు కలిసి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ టికెట్ పైనే కడియం కావ్య వరంగల్ ఎంపీగా గెలిచారు.ఇక జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. కొన్నిరోజులపాటు అలక పట్టడంతో ఢిల్లీ పెద్దలు బుజ్జగించాల్సి వచ్చింది.ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి.. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు.అసెంబ్లీలో కేటీఆర్‌తో గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి సమావేశమయ్యారు. ఈనెల 6న ఆయన బీఆర్ఎస్ పార్టీని వీడి సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఇంతలోనే యూటర్న్ తీసుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే గత ఆరు రోజులుగా అసెంబ్లీ సమావేశాలు జరుగుతు న్న విషయం తెలిసిందే.అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కేటీఆర్ ను కలిసిన గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి..ఇక నుంచి బీఆర్ఎస్ లోనే కొనసాగుతానని చెప్పారు. అయితే ఒకవైపు సీఎం రేవంత్ రెడ్డితో సహా కాంగ్రెస్ నేతలంతా రెండో విడత రుణమాఫీ కార్యక్రమానికి హాజరు కాగా, అదే సమయంలో కృష్ణమోహన్ కాంగ్రెస్ పార్టీని వీడి తిరిగి బీఆర్ఎస్ లోకి వెళ్లడం గమనార్హం

# ఏజెన్సీల్లో గ్రేహౌండ్స్ జల్లెడ



**వరంగల్, శుభ తెలంగాణ :** మావోయిస్టు అమరుల వారోత్స వాలు ఆదివారం నుండి ఆగష్టు 3 వరకు జరగనున్నాయి. మండలంలోని కోమటిపల్లి, తొండ్యాల లక్ష్మీపురం, కొత్తూరు మొట్లగూడెం, బుచ్చంపేట, నర్సాయిగూడెం,బాలన్నగూడెం, నర్సింహాసాగర్, పూరెడుపల్లి, మల్లూరు, చుంచుపల్లి, వాడ గూడెం, రమణక్క పేట, రాజుపేట, వాగొడ్డుగూడెం, రామచం ద్రుని పేట, నిమ్మగూడెం, దోమెడ పంచాయతీల పరిదిలోని అటవీ గ్రామాలలో ముమ్మరంగా పోలీస్ కూంబింగ్ చేపట్టారు. వారం రోజుల పాటు మావోయిస్టు అమరులను స్మరిస్తూ వాడ వాడలలో వారోత్సవాలు జరిపి విజయవంతం చేయాలంటూ మావోయిస్టులు ఇప్పటికే పిలుపునిచ్చిన నేపద్యంలో పోలీసులు అడవులను గొత్తికోయ ఆవాసాలున్న అటవీ ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు.మావోయిస్టు వారోత్సవాలను విఫలం చేసేందుకు పోలీసు యంత్రాంగం దృష్టి సారించింది. మంగపేట మండలంతో పాటు ఏటూరునాగారం సబ్ డివిజన్ పరిధిలోని కన్నాయిగూడెం, వాజేడు, పేరూరు, వెంకటాపురం (నూగూరు) మండలాల్లోని అటవీ ప్రాంతాల్లో ఇప్పటికే గ్రేహౌండ్స్, సీఆర్పీఎఫ్, కేంద్ర బలగాలు గ్రీన్ హంట్ పేరుతో కూంబింగ్ నిర్వహిస్తుయి. మావోయిస్టుల్లో గొత్తికోయలున్నా రనే సమాచారం మేరకు అటవీ ప్రాంతాల్లోని వారి ఆవాసాల ను లక్ష్యంగా చేసుకుని గూడాల్లో మావోయిస్టుల వాల్ పోస్టర్లు అంటించి సోదాలు, కార్డన్ సర్చ్ లు చేస్తూ అనుమానితుల సంచారం కోసం ఆరాతీస్తున్నారు. గొత్తికోయలతో సమావేశమై పరిచయంలేని వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వవద్దని హెచ్చరిస్తున్నారు.ఈ నెల 25న జిల్లాలోని తాడ్వాయి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం సరిహద్దు దామరతోగు అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో నల్లమారి అశోక్ ఏ విజెందర్ అనే మావోయిస్టు దళ సభ్యుడు మృతి చెందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎన్కౌంటర్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం భాద్యత వహించాలంటూ మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం అల్లూరి సీతారామరాజు డివిజన్ కార్యదర్శి ఆజాద్ పేర ప్రకటన విడుదల చేయడంతో పోలీసులు మండలంలోని అధికార పార్టీ నేతలను అప్రమత్తం చేశారు. వారోత్సవాల సందర్భంగా మావోయిస్టులు తమ ఉనికి చాటుకునేందుకు ఏదైనా దుశ్చర్యలకు పాల్పడే అవకాశాలున్నట్లు ఇంటెలిజెన్స్ సమాచారం ఉండడంతో వారోత్సవాలు ముగిసే వరకు మండలంలో యాక్టివ్ గా ఉండే నాయకులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని తమ అనుమతులు లేకుండా గ్రామాలకు వెళ్లవద్దని పర్యటనలను రద్దు చేసుకోవాలని హెచ్చరికలు జారీ చేసినపట్లు సమాచారం. వారోత్సవాలను విజయవంతం చేయాలని మావోయిస్టులు మరోపక్క విఫలం చేసే పనితో పోలీసులు నిత్యం అటవీ గ్రామాల్లో సోదాలు తనిఖీలు చేస్తుండడంతో నిర్వహించడం మండలంలోని గిరిజన గ్రామాల్లో ఎప్పుడేం జరుగుతుందోనని యువకులు ఆందోళన చెందుతున్నారు. తెల్లవారక ముందే పోలీసులు తెల్లవార్లు మావోయిస్టుల భయం వెంటాడుతుం డడంతో యువకులు గ్రామాలను విడిచిపోతున్నారు. మండ లంలో గతంలో మావోయిస్టు ప్రాభల్యం ఉన్న కమలాపురం, తిమ్మంపేట, నర్సింహాసాగర్, రామచంద్రునిపేట, రాజుపేట పంచాయతీలపై పోలీసుల నిఘా పెంచడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మావోయిస్టు వారోత్సవాలు ముగిసే వరకు గ్రామాల్లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయోనని ఆందోళన చెందుతున్నారు.

## కోదండ... రామ్... రామ్..ఏనా

**హైదరాబాద్ , శుభ తెలంగాణ:** తెలంగాణ ఉద్యమంతో ఓ వెలుగు వెలిగిన ఆచార్య కోదండరాం? రాజకీ యంగా సక్సెస్ అయ్యారా? లేదా? అన్న ప్రశ్నకు ఎవరూ కచ్చితమైన ఆన్సర్ చేయలేకపో తున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో రాజకీయంగా విభేదించిన కోదండరాం? సొంతంగా పార్టీ పెట్టినా? ప్రజల నుంచి ఆశించిన మద్దతు లభించలేదు. ఐతే సొంతంగా కేసీఆర్‌పై పైచేయి సాధించలేకపోయిన ప్రొఫెసర్ కోదండరాం?. 2018లోనే కాంగ్రెస్‌తో జట్టుకట్టి కారును గ్యారేజీకి పంపాలని శ్రమించినా ఫలితం దక్కలేదు. పట్టు వదలని విక్రమార్కునిలా మరోసారి గత ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి గులాబీ కోటను కూల్చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించి? ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా హస్తం పార్టీ విజయానికి దోహదపడ్డ ప్రొఫెసర్ కోదండరాంకి ఇప్పటివరకు ఎలాంటి పదవీ దక్కకపోవడంపై జన సమితి నేతల్లో తీవ్ర చర్చ సాగుతోందిఒక ఎమ్మెల్సీ, రెండు నామినేటెడ్ పోస్టుల హామీతో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న ప్రొఫెసర్ కోదండరాం పార్టీకి ఇంతవరకు ఏ ఒక్క పదవీ దక్కలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 8 నెలలైనా.. కోదండ˘రాంకి కానీ, ఆయన అనుచరులకు కాని ప్రభుత్వంలో ఎలాంటి గుర్తింపు లభించకపోవ డంపై తెలంగాణ జనసమితి నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది డిసెంబర్‌లో సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన తర్వాత? ఆయన క్యాబినెట్లో కోదండరాంని తీసుకుంటారని ప్రచారం జరిగింది. కానీ, అది ఉట్టి ప్రచారంగానే మిగిలి పోయింది. ఆ తర్వాత నిరుద్యోగుల ఆలోచన ప్రకారం టీఎస్పీఎస్సీ చైర్మన్‌గా నియమిస్తారని మరో ప్రచారం జరిగింది. ఐతే టీఎస్పీఎస్సీ చైర్మన్‌గా మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డిని నియమించడంతో? కోదండరాం పేరు ఊహాగానాలకే పరిమితమైంది. అదేవిధంగా జనవరిలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా కోదండరాం పేరును సిఫార్సు చేసినా? కోర్టు జోక్యంతో ఆ నియామకం పెండింగ్‌లో పడిపోయింది. ఇక అప్పటి నుంచి కోదండరాం పేరు వెయిటింగ్ లిస్టులోనే పడిపోయింది.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఊరిస్తున్న పదవులన్నీ? కోదండరాంకి దక్కకపోగా, ఆయనకు బాధ్యతలు ఎక్కువైపోయా యంటున్నారు. మాజీ సీఎం కేసీఆర్ సర్కార్ పతనానికి ప్రధాన కారణమైన నిరుద్యోగ సమస్య? ఇప్పుడు కోదండరాం మెడకు చుట్టుకుంటోందట. ఉద్యోగ నియామకాల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు? కోదండరాంనే టార్గెట్ చేస్తున్నారు. ఎన్నికల్లో ప్రొఫెసర్ కోదండరాం మాటలు వినే.. తామంతా కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచామని.. కానీ ఇప్పుడు కొన్ని విషయాల్లో ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ కోదండరాం ఇంటి ముందు ఆందోళనలకు దిగుతున్నారు నిరుద్యోగులు.అటు పదవీ దక్కక? ఇటు ప్రజలు, నిరుద్యోగుల నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో? ప్రొఫెసర్ కోదండరాంకు పొలిటికల్ కెరీర్ అచ్చిరాలేదంటూ కామెంట్లు వినిపిస్తున్నాయి. తన మద్దతుతో ప్రభుత్వాలను ఏర్పాటు చేయించగలుగుతున్న ప్రొఫెసర్ కోదండరాం? ప్రభుత్వంలో భాగం కాలేకపోతున్నారంటున్నారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో జేఏసీ చైర్మన్‌గా కీలకంగా పనిచేసిన కోదండరాం?. రాష్ట్రం ఆవిర్భవించిన పదేళ్ల తర్వాత కూడా ప్రభుత్వ పదవి దక్కించుకోలేకపోవడం, ముఖ్యంగా తానెంతో కోరుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం? సీఎం రేవంత్‌రెడ్డి హయాంలోనూ పదవి అందని ద్రాక్షగా మారడంపై రకరకాల చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తమకు నామినేటెడ్ పదవులు వస్తాయని ఆశించిన తెలంగాణ జనసమితి నేతలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నట్లు తెలుస్తోంది. తమ నేతకే ఏ దిక్కులేకపోవడంతో తమనెవరూ పట్టించుకోవడం లేదని టీజేఎస్ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు చెబుతున్నారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఇప్పటివరకు అమలు కాకపోవడం? కాంగ్రెస్ నేతలకు వరుసగా నామినేటెడ్ పదవులను కట్టబెడుతూ నిర్ణయాలు తీసుకుంటుండటం వల్ల టీజేఎస్ వర్గాలు ప్రొఫెసర్ కోదండరాంపై ఒత్తిడి తెస్తున్నట్లు చెబుతున్నారు. తనకే ఏ పదవీ లేకపోవడం? తన వారిని ఎలా సర్దుబాటు చేయాలో తెలియక ఎరక్కపోయి.. ఇరుక్కుపోయామా? అంటూ టీజేఎస్ అధినేత నిర్వేదం వ్యక్తం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో టీజేఎస్ నేత ప్రొఫెసర్ కోదండరాం ఆవేదనను కాంగ్రెస్ హైకమాండ్ అర్థం చేసుకుంటుందా? అనేది ఆసక్తికరంగా మారింది. ప్రొఫెసర్ నిరీక్షణకు ఎలాంటి ముగింపు పలుకుతుందో చూడాల్సివుంది.

## బండ్ల బాటలో మరో ముగ్గురు



**హైదరాబాద్, శుభ తెలంగాణ :** గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఎపిసోడ్ తెలంగాణ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో ఇటీవల గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన కృష్ణమోహన్ రెడ్డి కొన్ని రోజుల్లోనే మనసు మార్చుకున్నారు. ఇవాళ కాంగ్రెస్‌కు కటిఫ్ చెప్పి తిరిగి సొంత గూటికీ చేరుకున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బండ్ల తిరిగి గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. బండ్ల ఎపిసోడ్‌తో స్టేట్ పాలిటిక్స్‌లో కొత్త ప్రచారం తెరపైకి వచ్చింది. అధికార కాంగ్రెస్ పార్టీ మొదలుపెట్టిన ఆపరేషన్ ఆకర్ష్‌కు కౌంటర్‌గా ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఘర్ వాపసీకి తెరలేపినట్లు పొలిటికల్ సర్కిల్స్‌లో ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగానే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి గులాబీ గూటికీ తిరిగి వచ్చారని బీఆర్ఎస్ వర్గాల్లో చర్చ మొదలైంది.రాష్ట్రంలో గులాబీ పార్టీ పవర్ కోల్పోవడంతో పాటు పార్లమెంట్ ఎన్నికల్లో పూర్ ఫెర్మామెన్స్ ప్రదర్శించడంతో 10 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కూడా ఇందులో ఒకరే. తాజాగా బండ్ల మనసు మార్చుకుని మళ్లీ సొంత గూటికీ చేరుకోవడంతో.. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన మరో ముగ్గురు ఎమ్మెల్యేలు కూడా బండ్ల దారిలోనే వచ్చేందుకు సిద్ధమైనట్లు పొలిటికల్ సర్కిల్స్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్‌తో బంధం తెంచుకుని బయటకు వెళ్లిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, చెవేళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, మంత్రి పొంగులేటి అనుచరుడు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తిరిగి సొంత గూటికి రావాలని డిసైడ్ అయినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే ఇవాల ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు బీఆర్ఎస్ మాజీ మంత్రులు కేటీఆర్, ప్రశాంత్ రెడ్డితో భేటీ అయినట్లు జరుగుతోన్న ప్రచారం బీఆర్ఎస్ ఘర్ వాపసీ వార్తలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, కాలే యాదయ్య కూడా తిరిగి సొంత గూటికీ వస్తారని బీఆర్ఎస్‌లోని అగ్ర నేతలు బలంగా చెబుతుండటంతో తెలంగాణ పాలిటిక్స్ ముందు ముందు మరింత రసవత్తరంగా మారే సిట్యూవేషన్స్ కనిపిస్తున్నాయి.బీఆర్ఎస్ నుండి ఎమ్మెల్యేల వలసల ప్రవాహం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో మొదలైంది. ఫస్ట్ బీఆర్ఎస్‌ను వీడి అధికారం పార్టీలో చేరింది ఎమ్మెల్యే దానం నాగేందరే. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రారంభించిన ఆపరేషన్ ఆకర్ష్‌తో బీఆర్ఎస్‌లో వలసల ప్రవాహం కొనసాగింది. ఒకరి వెంట ఒకరు గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ లో చేరి కేసీఆర్‌కు వరుస షాకులు ఇచ్చారు. దానం తర్వాత ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కడియం, పోచారం, సంజయ్, కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్, బండ్ల, గూడెం మహిపాల్ రెడ్డి బీఆర్ఎస్‌కు టాటా చెప్పి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కేసీఆర్ అత్యంత ఆప్తులుగా పేరున్న కడియం శ్రీహరి, పోచారం పార్టీ మారడం గులాబీ పార్టీలో పెద్ద గుబులే రేపింది. అయితే, కాంగ్రెస్‌పై ఆరు నెలల్లోనే వ్యతిరేకత వచ్చిందని, ఆరు గ్యారెంటీల అమలులో జాప్యం రేవంత్ రెడ్డి సర్కార్‌పై ఎఫెక్ట్ చూపించిందని పొలిటికల్ కారిడార్స్‌లో చర్చ జరగడంతో పాటు పార్టీలో చేరే ముందు ఇచ్చిన ప్రియారిటీ ఆ తర్వాత దక్కడం లేదని వాపోతున్న జంపింగ్ లీడర్స్ తిరిగి గులాబీ గూటికీ రావాలని ప్రయత్నాలు షూరు చేసినట్లు టాక్. కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిన ఆపరేషన్ ఆకర్ష్‌కు కౌంటర్‌గా బీఆర్ఎస్ తెరలేపిన ఘర్ వాపసీలో భాగంగా అధికార పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు తిరిగి సొంత గూటికీ వస్తారా లేదా అనేది తెలియాలంటే మరి

Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110